

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:22 (మంగళవారం సాయంత్రం)
సహర్ : 4:48 (బుధవారం ఉదయం)

ప్రశాంతంగా 'పది' పరీక్షలు




ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలో పరీక్షలు రాస్తున్న విద్యార్థినులు.. ముమ్మిడివరం హైస్కూల్‌లో..

» పరీక్షా కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, జేసీ, డీఈవోలు
» తొలిరోజు పరీక్షకు గైర్హాజరైన 104 మంది విద్యార్థులు

అమలాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రశాంత పరిస్థితుల నడుమ పరీక్షలను తొలిరోజు నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఈవోలు పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా తొలిరోజు పరీక్షకు 104 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అమలాపురం పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష గదిలో సిమెంటు బస్తాలు ఉంచడంతో కలకలం రేగింది. అలాగే జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఒకేసారి చెత్త కుప్పలు తగలబెట్టడంతో పొగ తీవ్రతతో పరీక్షకు హాజరైన విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తొలిరోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. అమలాపురం పట్టణంలోని కొంకాపల్లి మున్సిపల్ హైస్కూలులో పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి కామనగరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీఈవో షేక్ సలీంబాషా పలు ప్రాంతాల్లో పర్యటించడంతోపాటు అమలాపురంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేసి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. జిల్లా వ్యాప్తంగా 19,046 మంది రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులకుగాను 18,942 మంది తొలిరోజు పరీక్షకు హాజరు కాగా 104 మంది గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 18,984 మందికిగాను 18,906 మంది విద్యార్థులు హాజరుకాగా 78 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటుగా 62 మంది విద్యార్థులకుగాను 36 మంది హాజరుకాగా 26 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలోని 110 పరీక్షా కేంద్రాలకు 946 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్టు డీఈవో తెలిపారు. జిల్లాస్థాయిలో ఉన్నతాధికారులతోపాటు 13 మంది పరిశీలకులు, ఐదుగురు ఏపీఎస్ఈఆర్ఎంసీ సభ్యులు, ఐదుగురు జిల్లాస్థాయి అధికారులు, 28 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.



కొంకాపల్లిలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్



పరీక్ష రాసే విద్యార్థినికి సూచనలిస్తున్న పోలీసు అధికారి



పరీక్ష గదిలో.. సిమెంటు బస్తాలు

» అదే సమయంలో చెత్త కుప్పలు తగులబెట్టడంతో పొగ
» విచారణ చేపట్టిన ఆర్డీవో, డీఈవోలు

7



వనామీపై విబ్రియో వైరస్ దాడి

మలికిపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేసవిలో రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆక్వా సాగుపై వైరస్‌లు ముట్టడించాయి. దీంతో రొయ్యల సాగు అతలాకుతలం అవుతోంది. జిల్లాలోని మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లోని వనామీ రొయ్యల చెరువులపై విబ్రియో, వైట్‌స్పాట్ వైరస్‌లు విజృంభించడంతో రొయ్యల పిల్ల వేసిన 20 రోజుల నుంచే చనిపోవడం మొదలవుతున్నాయి. దీంతో చాలా ప్రాంతాల్లో 200, 300 కౌంట్లలోనూ రైతులు పట్టుబడులు పడుతున్నారు. ఈ కౌంట్‌లో పట్టుబడి చేస్తే కిలో

ఆక్వా రైతులపై పెనుభారం

రూ.90 చొప్పున కొనుగోలు జరుగుతోంది. ప్రస్తుతం వంద కౌంటు రూ.225 నుంచి రూ.235, 40 కౌంటు రూ.365, 30 కౌంట్ రూ.465 ధర పలుకుతుండగా 200 కౌంట్ కిలో రూ.175, 300కౌంట్ రూ.130కి అమ్మకాలు జరుగుతున్నాయి. పురిటిలోనే రొయ్య పిల్లలు చనిపోతుండడంతో రైతులపై పెనుభారం పడుతోంది. వేసవిలో రొయ్యలు త్వరగా ఎదుగుతాయని, తక్కువ రోజుల్లో కౌంటుకు వస్తాయన్న రైతుల ఆశలు అడియాసలయ్యాయి.

ఆక్వా రైతులను ఆదుకుంటాం

అప్సడా వైస్‌చైర్మన్ ఆనం



అంతర్వేది, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కుదేలవుతున్న ఆక్వా రంగాన్ని ఆదుకునేందుకు త్వరలో కొన్ని ప్రతిపాదనలు సిద్ధం చేశామని అప్సడా వైస్‌చైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి అన్నారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చిన ఆయనను కొంత మంది ఆక్వా రైతులు కలిసి మాట్లాడారు. ప్రధానంగా దళారీ వ్యవస్థకు చెక్ పెడుతూ ఆక్వా రైతులకు మేలు చేకూర్చే విధంగా రేటును స్థిరంగా ఉంచడానికి ప్రభుత్వం తరపున కొన్ని తీర్మానాలు చేస్తున్నామన్నారు. ప్రధానంగా విద్యుత్, మేత రేట్లు, క్వాలిటీ సీడ్ విషయంలో రాజీ పడకుండా ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకునేలా కమిటీ ఏర్పాటుచేసి నిర్ణయిస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం ఆక్వారంగంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించిందని, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ అత్యంత ఎక్కువగా సాగుచేసే ఆక్వారైతులను ప్రభుత్వం ఆదుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో నల్లా సత్యకృష్ణకిరణ్‌ప్రసాద్, రావూరి నాగు, దిరిశాల బాలాజీ, బైరా నాగరాజు, ముప్పర్తి నాని పాల్గొన్నారు.

ప్రైవేటుకు.. ఫిట్‌నెస్!



జిల్లాకో ఏటీఎస్ కేంద్రం ఏర్పాటు

» 3 జిల్లాలు 3 కేంద్రాలు
» తూర్పునకు రాజానగరం
» కాకినాడకు వాకలపూడి
» నెలాఖరుకు కోనసీమలో
» ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇక ప్రైవేటు
» ఆర్టీఏ కార్యాలయాలకు దూరం
» ఏ జిల్లా వాహనాలు అక్కడే
» రోజుకు 50 వాహనాల టెస్టులు
» సర్కారు ఆదాయానికి గండి
» రెండేళ్ల వరకూ ప్రైవేటు జేబు ఫుల్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వాహనాల ఫిట్‌నెస్‌కు ఇక ఆర్‌టీవో అధికారుల చుట్టూ తిరగాల్సిన పనేలేదు.. ఎందుకంటే వాహనాల ఫిట్‌నెస్ బాధ్యతను ప్రైవేట్‌కు అప్పగించారు. కేంద్ర రవాణా శాఖ ఆదేశాలతో జిల్లాకు ఒక ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్)ను శాంక్షన్ చేసింది. రాజమహేంద్రవరం, కాకినాడ, విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు సంబంధించి సీటీఆర్‌ఎల్ ఆల్ట్ ఫిక్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు టెండరు దక్కింది. ఆ సంస్థ ఐదు జిల్లాల్లో శుక్రవారం నుంచి వీటిని ప్రారంభించారు. ఈ నెల 31వ తేదీలోపు అన్ని జిల్లాల్లో ఈ స్టేషన్లు పనిచేయనున్నాయి. ఆయా జిల్లాల్లో ప్రజలకు సంబంధించిన లైట్ మోటారు వెహికిల్స్, హెవీ మోటార్ వెహికిల్స్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఈ సంస్థ మాత్రమే ఇస్తుంది. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజానగరం, కాకినాడ జిల్లాకు సంబంధించి వాకలపూడిలో ఏర్పాటు చేశారు. ఇక కోనసీమ జిల్లాలో ఈ నెలాఖరుకు ఏర్పాటు చేయనున్నారు. ఇంతవరకూ ఆర్టీఏ కార్యాలయంలో ఫిట్‌నెస్ సర్టిఫై చేసేవారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుంటే ఆయా వాహనాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం చలానా కట్టించుకుని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చేవారు. ఈ పనులన్నీ ఇకపై ఈఏటీఎస్‌లో జరుగుతాయి.

ప్రైవేటీకరణ ఎందుకు?

ఫిట్‌నెస్ సర్టిఫై ప్రైవేటీకరణ చేయడం వల్ల ఉపయోగం ఏంటి? ఎందువల్ల రవాణా శాఖ నుంచి ఈ విధులను తప్పించారనేదానికి సమాధానం లేదు. ఆర్టీఏ అధికారులకు ఏ విధమైన సమాచారం లేదని చెప్పడం గమనార్హం. అవినీతి తగ్గించాలని ప్రైవేటీకరించారా.. లేదా ఎక్కువ ఆదాయం కోసం అమలుచేస్తున్నారా, ఫిట్‌నెస్‌లో లోపాలు ఏమైనా బాగుపడతాయని చూస్తున్నారా అనేది తెలియడంలేదు. వాహనాలు ఫిట్‌నెస్ సరిగ్గా లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. నిజాయితీగా ఈ టెస్టులు నిర్వహిస్తే మేలే. ప్రైవేట్ బస్సులు, కార్లు, క్యాబ్‌లు, ట్రాక్టర్లు, లారీలు, గూడ్స్ వాహనాలు, ట్యాంకర్లు, స్కూల్ బస్సులు వంటివన్నీ ఫిట్‌నెస్ టెస్ట్ చేయించుకోవాలి. పసుపు నెంబరు బోర్డులు ఉంటే ట్రాన్స్‌పోర్టు, తెలుపు నెంబరు ప్లేట్లు ఉంటే నాన్- ట్రాన్స్‌పోర్టు వాహనాలుగా పరిగణిస్తారు. కొత్త వాహనానికి లైఫ్‌టైమ్‌లో మొదటి 8 ఏళ్లలో ప్రతి రెండేళ్లకో సారి ఫిట్‌నెస్ టెస్ట్ చేయించాలి. 8 ఏళ్ల తర్వాత ఏడాదికోసారి టెస్ట్ చేయించాలి. 15 ఏళ్లకు కండిషన్ చూసి ఆపేయాలి. స్కూల్ బస్సులకు కేవలం 15 ఏళ్ల వరకే ఫిట్‌నెస్ చూస్తారు. తర్వాత వాటిని స్కూల్ బస్సుల కింద వాడకూడదు.గతంలో జిల్లాలో వాహనాల ఫిట్‌నెస్ రాజమహేంద్రవరం, కొవ్వూరు ఆర్టీవో కార్యాలయాల్లో నిర్వహించేవారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని వాహనాలు రాజానగరం కల్వచర్ల ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్)కు రావాల్సిందే.

రెండేళ్ల ఆదాయం జేబుల్లోకే!

సాధారణంగా వాహనాల ఫిట్‌నెస్ వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.కోట్ల ఆదాయం వచ్చేది. జిల్లాలో వేలాది వాహనాలు ఉన్నాయి. కేంద్ర ట్రాన్స్‌పోర్టు ఇండియా సలహా మేరకు ఏటీఎస్‌లు రెండేళ్లపాటు వాహనాల నుంచి ఫిట్ నెస్ టెస్ట్ కోసం వసూలు చేసిన సొమ్మంతా సొంతానికి వినియోగించుకోవచ్చు. ప్రభుత్వానికి ఒక పైసా కూడా చెల్లించనవసరం లేదు. ఇది టెండర్ విధానంలో పెట్టిన నిబంధనగా చెబుతున్నారు. ఒక్కో ఏటీఎస్‌కు ఖర్చు రూ.4.5 కోట్లు అవుతుందని నిర్వాహకుల కథనం. ప్రతి స్టేషన్‌లో మిషనరీతోపాటు 21 మంది సిబ్బంది ఉంటారు. ప్రభుత్వం గతంలో వసూలు చేసిన చలానా కంటే రూ.200కు పైగా పెంచినట్టు చెబుతున్నారు. ప్రస్తుతం ఏటీఎస్ చలానా ధరల ప్రకారం లైట్ మోటారు వెహికల్ కేటగిరీకి అంటే ఆటో నుంచి మొదలు మిగతా అన్నింటికి ఫిట్‌నెస్ పరీక్షకు రూ.860 వసూలు చేయాలి. హెవీ మోటారు వెహికిల్స్‌కు రూ.1320 వసూలు చేయాలి. రోజుకు ఒక్కో స్టేషన్‌లో 50 వాహనాలకు టెస్టులు చేస్తామని నిర్వాహకులు చెబుతున్నారు.

అవినీతిని కొనసాగిస్తారా..

గతంలో ఆర్టీవో కార్యాలయాల్లో ఫిట్‌నెస్‌కు ప్రభుత్వ చలానాతోపాటు అదనంగా వసూలు చేసిన అవినీతి సొమ్మును ఈ కొత్త విధానంలో కూడా వసూలు చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. రాజానగరంలోని ఏటీఎస్‌లో అక్కడి నిర్వాహకుడు ఒకరు జిల్లాలోని ఆర్టీఏ ఏజెంట్లను పిలిచి సుమారు గంట సేపు సమావేశం నిర్వహించడం గమనార్హం. గతంలో ఎలా అయితే వాహనదారుల నుంచి అదనంగా వసూలు చేసి అధికారులకు ఇచ్చేవారో.. అలాగే తమకు కూడా ఇవ్వాలని, అపుడే మీ కమీషన్ మీకు వస్తుందని స్పష్టంచేసినట్టు సమాచారం. త్వరలో రవాణా అధికారులతో కూడా తాము లోపాయికారిగా ఒప్పందం పెట్టుకుంటామని చెప్పినట్టు సమాచారం. దీనిపై ఏజెంట్లు స్పందించి ఒక నెల తమకు గడువు ఇస్తే తర్వాత ఎలా చేయమంటే అలా చేస్తామని కూడా చెప్పినట్టు సమాచారం. ఇదిలా ఉండగా గతంలో రవాణా శాఖ అధికారులు వసూలు చేసిన జాబితా ఒకటి బయటకు రావడం గమనార్హం.

మహిళల భద్రతకు శక్తి యాప్

నేర సమీక్షలో ఎస్పీ కృష్ణారావు



జిల్లాస్థాయి నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు, అదనపు ఎస్పీ ప్రసాద్

అమలాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న శక్తి యాప్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు సూచించారు. శక్తి యాప్‌ను ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో చర్చించారు. కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలో క్రైమ్ రేటు తగ్గించడంతో పాటు నేర పరిశోధనకు తగు సూచనలు చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా పరీక్షా కేంద్రాల వద్ద ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, డీఎస్పీలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కాకినాడలో వివాహిత ఆత్మహత్య

7



కాలువ నుంచి తీసిన కుమార్తె మృతదేహం

నాన్నకు.. ఏమైంది!

గజపతినగరంలో ఇద్దరు పిల్లలను కాలువలో తోసేసిన తండ్రి

7

నాన్నకు ఏదో అయ్యింది.. లేకపోతే ఇదేంటి.. కాకినాడలో ఇద్దరు చిన్నారులను అమానుషంగా చంపేసిన కన్నతండ్రి ఘటన మరువక ముందే బీ.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా గజపతినగరంలో జరిగిన మరొక ఘటన నివ్వెరపోయేలా చేసింది.. ఒక తండ్రి తన ఇద్దరు పిల్లలను రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు శివారు గజపతినగరం వద్ద కాలువలో అమానుషంగా తోసేసి వెళ్లిపోయాడు.. నాన్న ఎందుకో కాలువ వద్దకు తీసుకెళుతున్నాడనుకున్నారో ఏమో కానీ ఆ చిన్నారులు నాన్న వెంటే నడిచారు.. ఉన్నట్టుండి ఇద్దరినీ కాలువలో తోసేయడంతో కుమార్తె మునిగిపోగా.. కుమారుడు మాత్రం కాలువలో ఉండే చెట్టును పట్టుకుని బతికిబయటపడ్డాడు.

పట్టాలు మంజూరుచేయాలి

కలెక్టరేట్ ఎదుట దళితుల నిరసన

రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని ఓదూరు గ్రామంలో 1978లో ఇచ్చిన ఇళ్లస్థల పట్టాలు స్థానే కొత్తగా పట్టాలు ఇస్తే తిరిగి గృహాలు నిర్మించుకుంటామని గ్రామసర్పంచ్ వింజుమళ్ల విమలకుమారి ఆధ్వర్యంలో దళిత కుటుంబీకులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అప్పట్లో ఇచ్చిన ఇళ్లస్థల పట్టాలను ఇంటి నిర్మాణ రుణాల నిమిత్తం గృహనిర్మాణశాఖకు అప్పగించాం. అప్పట్లో నిర్మించుకున్న ఇళ్లు పాడైపోతున్నందున తిరిగి పునర్నిర్మించుకునేందుకు సర్వే నిర్వహించి ఇళ్లస్థల పట్టాలు అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో ఓదూరు రాజబాబు, పిల్లి రాజు, జిల్లెల్ల రాజు, జిల్లెల్ల శాంతి, పిల్లి చిన్నయ్య, చేగొండి అప్పారావు, ఓదూరు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో అర్జీ అందించారు.

పాడైపోయిన డ్యామ్ గేట్లు మరమ్మతులు చేయాలి

మురుగు డ్రెయిన్ నుంచి నీరు నేరుగా పంట పొలాల్లోకి పొర్లుతుండడంతో పేరూరు ఎఫ్‌సీఐ గోడౌన్ సమీపంలో పంట భూములు ముంపు బారిన పడుతున్నాయి. అధిక వర్షాలతో ప్రతీ ఏటా ఖరీఫ్ సీజన్‌ను కోల్పోవలసి వస్తోంది. డ్రెయిన్‌కు పూర్వం ఏర్పాటుచేసిన డ్యామ్ కాలక్రమంలో పాడైపోయింది. తక్షణం డ్యామ్ గేట్లు కొత్తగా ఏర్పాటుచేసి పంటభూములు ముంపు బారిన పడకుండా కాపాడాలి.

- దేగుల వెంకటరమణ, పేరూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు 270 అర్జీలు

» ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి : కలెక్టర్ మహేష్‌కుమార్



కలెక్టరేట్‌లో అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. అర్జీలను నిర్ణీత గడువులో గా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. రాష్ట్రస్థాయిలో ఆడిట్ బృందాలు అర్జీదారులకు నేరుగా ఫోన్‌చేసి సమస్య పరిష్కారంపై సంతృప్తి చెందారా లేదా అని అడిగి తెలుసుకుంటున్నట్టు వివరించారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండానే ఆయా మండల, డివిజన్ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సద్వినియోగం చేసుకుని పరిష్కారాలు పొందవచ్చనని వివరించారు. కలెక్టర్ మహేష్‌కుమార్‌తోపాటు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణమూర్తిలు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 270 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, జిల్లా వైద్యసేవల సమన్వయకర్త కార్తీక్‌రెడ్డి, సీపీవో వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, డీపీవో డి.శాంతలక్ష్మి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ టి.ప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఈ రామకృష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్‌తోపాటు అధికారులు పాల్గొన్నారు.

సమస్యల నివేదికలను అందించండి..

ఈ నెల 24, 25 తేదీల్లో అమరావతిలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నందున జిల్లాకు సంబంధించి శాఖల వారీగా ఉన్న సమస్యలను నివేదిక రూపంలో కలెక్టరేట్‌కు సమర్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆయా శాఖల ఉన్నతాధికారులకు సూచించారు. ఈనెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు శాఖల వారీగా జిల్లా స్థాయిలో సమీక్షించి ప్రధాన సమస్యలను కలెక్టర్ల కాన్ఫరెన్సులో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించే దిశగా చర్యలు చేపడతామని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. .

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి : విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు

పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఎం చంద్రబాబును కోరుతూ ఏపీ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అర్జీ అందించారు. తొలుత కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, మధ్యంతర భృతిని చెల్లించాలని డిమాండ్ చేశారు. డీఆర్, పీఆర్సీ బకాయిలు వెంటనే ఇప్పించాలని, ఈహెచ్ఎస్ కార్డుపై నగదు రహిత వైద్యం పూర్తిస్థాయిలో అందేలా చూడాలని కోరారు. జిల్లాశాఖ అధ్యక్షుడు జీఎస్ఎస్ గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి వీవీవీ సత్యనారాయణ రాజు, కోశాధికారి ఎం.ఆశీర్వాదం, రాష్ట్ర కార్యదర్శి ఎస్వీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికై సమ్మె నోటీసు : ఎన్టీఆర్ వైద్యసేవా పథకం సిబ్బంది

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా పథకంలో పనిచేస్తున్న సిబ్బంది, ఉద్యోగుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ కలెక్టర్‌కు సోమవారం సమ్మె నోటీసు అందజేసి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఎన్టీఆర్ వైద్యసేవా పథకంలో వైద్య మిత్రలు, టీమ్ లీడర్లు, జిల్లా మేనేజర్లుతోపాటు తదితర ఉద్యోగులకు జీతభత్యాలు పెంచాలని, ఉద్యోగభద్రత కల్పించాలని కోరుతూ ప్రభుత్వానికి సమ్మె నోటీసు ద్వారా తెలియచేసినట్టు నరసింహరాజు తెలిపారు. ఈ నెల 17, 24 తేదీల్లో సమ్మె చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, వెంకయ్యనాయుడు, కిశోర్, శంకర్, రాజు, రాయుడు సతీష్, సత్యనారాయణ, జ్యోతికుమారి పాల్గొన్నారు. అదేవిధంగా బుద్ధగయను బేషరతుగా బౌద్ధులకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కలెక్టర్‌కు అర్జీ అందించారు. జిల్లాశాఖ అధ్యక్షుడు కాశి రాంబోధి, జిల్లాప్రధాన కార్యదర్శి ములపర్తి సత్యనారాయణ, ఈవీవీ సత్యనారాయణ, కోలా త్రిమూర్తులు పాల్గొన్నారు.







మనల్ని ఎవడ్రా ఆపేది..

ఇష్టారాజ్యంగా వాహనాల నెంబర్ల ప్లేట్లపై రాతలు.. కనిపించని హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు

ప్రస్తుతం యువత ట్రెండ్ సెట్ చేస్తున్నాం.. అనుకుంటూనే ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. కార్లు, బైక్‌లకు నెంబర్ ప్లేట్లు లేకుండా ఇష్టారీతిన రోడ్లపై తిరుగుతున్నారు. మైనర్లు సైతం అధిక సీసీ ఉన్న బైక్‌లపై రేస్‌లంటూ దూసుకెళుతున్నారు. అనుకోని ప్రమాదం జరిగితే జరిగే నష్టం అపారం. ఇలా బైక్‌లపై ఫీట్లు చేస్తున్న వారిని గుర్తించేందుకు వెహికల్ నెంబర్ ప్లేట్లు ఎంతో కీలకం. తీరా ఆ బైక్‌ల నెంబర్లును గుర్తించేందుకు వీలులేకుండా రకరకాల పేర్లతో నెంబరు ప్లేట్లపై రాసేస్తున్నారు. ఫలితంగా ప్రమాదం జరిగిన సమయంలో బాధితులు ఎవరో కూడా తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంటోంది.

కార్పొరేషన్(కాకినాడ), మార్చి17(ఆంధ్రజ్యోతి): నెంబరు ప్లేట్లు లేకుండా కొందరు ద్విచక్ర వాహనదారులు రోడ్లపై ఇష్టానుసారంగా వాటిని నడుపుతున్నారు. కొంతమంది కార్లు ఉన్నవారిదీ అదే తీరు. రవాణాశాఖాధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడం, పోలీసులు చూస్తున్నా వెంటనే స్పందించకపోవడంతో వాహనదారుల తీరు మితిమీరుతోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు అమర్చాల్సి ఉన్నా కొందరు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో నగరంలోని పలు మార్గాల్లో నెంబరు ప్లేట్లులేని, నెంబర్లు లేని, చిన్నగా, గజిబిజిగా రాయించిన, అస్పష్టంగా ఉన్న నెంబర్లతో వాహనదారులు రోడ్డుపై దూసుకుపోతున్నారు. కొందరు వాహనదారులు ఏకంగా సినీ హీరోలు, రాజకీయ నాయకుల ఫొటోలు, పేర్లు, ఇతరత్రా చిత్రాలతో తిరుగుతున్నారు. ఇంకొంతమంది వాహనదారులు ఎమ్మెల్యే, ఎంపీ, సీఎం తాలూకా అంటూ నెంబర్ ప్లేట్లు బదులు ఆ ప్లేట్లపై ఈవిధంగా రాసుకుంటున్నారు. వీటితోపాటు మరికొందరు మనల్ని ఎవడ్రా ఆపేదంటూ అధికారులకే సవాల్ విసురుతున్నారు. అయినా సంబంధిత అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. 2019 నుంచి షోరూంల్లో వాహనాలను కొన్నవారు తప్పనిసరిగా ప్రభుత్వం అందించే హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు మాత్రమే బిగించుకోవాలన్న నిబంధన అమలుల్లోకి వచ్చింది. చాలామంది వీటిని పట్టించుకోవడం లేదు. నెంబరు ప్లేట్లను సంబంధిత

ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?

వాహన విక్రయదారులే సమకూరుస్తున్నా కొన్ని కొత్త వాహనాలకు ప్లేట్లు నిబంధనల ప్రకారం కనిపించడంలేదు. ఎక్కువగా యువకులు రకరకాల రూపాల్లో నెంబరు ప్లేట్లను అమర్చుతున్నారు. బైక్ రేసుల పేరుతోను, లేదా ఇద్దరు ముగ్గురు కలిసి విపరీతమైన స్పీడ్‌తో దూసుకెళుతున్నప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులను గుర్తించే క్రమంలో నెంబరు ప్లేట్లు ఇబ్బందికరంగా మారుతున్నాయి.

హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు తప్పనిసరి



సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్ ప్రకారం మోటార్ వాహనాలపై రిజిస్ట్రేషన్ మార్కు ప్రదర్శించేలా అన్ని మోటారు వాహనాల ముందు, వెనుక భాగాల్లో హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్ఎస్ఆర్పీ) రూపంలో స్పష్టంగా ఉండాలి. అవసరమైన చోట వాహనం ఎడమ చేతి వైపు ముందు గ్లాసుపై క్రోమియం ఆధారిత హోలోగ్రామ్ స్టిక్కర్ కూడా ఉండాలి. కొంతమంది వాహన యజమానులు ఈహెచ్ఆర్పీని వాహనానికి అమర్చడం లేదని డీలర్లు తెలిపారు. ఇది సరికాదు. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- కె.శ్రీధర్, జిల్లా ఉపరవాణా కమిషనర్, కాకినాడ



ఆదిత్య ప్రో కార్టింగ్ ఎండురన్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

సూరంపాలెం 'ఆదిత్య'లో ప్రో కార్టింగ్ ఎండురన్స్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

గండేపల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఆదిత్య ప్రోకార్టింగ్ ఎండురన్స్ చాంపియన్‌షిప్-2025 సీజన్-5 పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రోఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏపీ, తమిళనాడునుంచి ఈ చాంపియన్‌షిప్ పోటీల్లో 13 టీమ్‌లు పాల్గొన్నాయి. ముందుగా బెలూన్లు ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదిత్య వైస్‌చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ పోటీ ల్లో పాల్గొనే విద్యార్థులకు అన్నిసౌకర్యాలు కల్పించామన్నారు. పూర్తి పారదర్శకంగా పోటీలునిర్వహించేలా అన్ని ఏర్పాటు చేశామన్నారు. డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల్లోపాల్గొనడం ద్వారా విద్యార్థులకుటీమ్ స్పిరిట్ లభిస్తుందన్నారు. ఒకరి అభిప్రాయాలు ఒకరు గౌరవించుకోవడం నేర్చుకుంటారన్నారు. మెకానికల్ విభాగం అధిపతి డాక్టర్ భీమేష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీల్లో బ్రేక్ టెస్ట్, ఇంజన్ టెస్ట్, డిజైన్ స్పీడ్ టెస్ట్ తదితర విభాగాల్లో నిష్ణాతులైన న్యాయనిర్ణేతలు పరీక్షించి విజేతలను నిర్ణయిస్తారన్నారు. విజేతలకు రూ.4లక్షలు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆదిత్య వైస్ ఛాన్సలర్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్ పాల్గొన్నారు.



బెలూన్లు ఎగురవేసి పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

సత్యనికేతన్ సత్రం వ్యవహారంపై ఈవోను కలిసిన డీఎస్పీ, సీఐ

అన్నవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో కొండదిగువన ఉన్న సత్యనికేతన్ సత్రంలో ఈవో ఆకస్మిక తనిఖీల్లో ఖాళీ మద్యం సీసాలు దొరికిన సంఘటనపై పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐసూరిఅప్పారావు ఈవో వీర్ల సుబ్బారావును సోమవారం కలిసి చర్చించారు. దీనిపై ఇప్పటికే ఈవో ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఇదివరకే ఆయన పర్యటన 18న ఖరారుకావడంతో దీనిపై కూడా మంగళవారం చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సత్యనికేతన్ సత్రంలో పోలీసులకు రెండు గదులు కేటాయించగా వాటిని సోమవారం ఖాళీ చేశారు. సిబ్బందిని సైతం వారం రోజుల్లో సత్రంగదులు ఖాళీచేయాలని ఈవో ఆదేశించారు. ఎప్పటినుంచి పోలీసులు, దేవస్థానం సిబ్బంది గదుల్లో ఉంటున్నారు తదితర వివరాలను అందించాలని సీఆర్వో విభాగ అధికారులను ఆదేశించారు. మరోపక్క అన్నవరం దేవస్థానానికి చెందిన స్థలాల్లో ఆక్రమణలపై, పంపా రిజర్వాయర్‌లో నీటినిల్వలపై కూడా ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ చర్చిస్తారు. కొండపై సమావేశం గురించి ఎటువంటి సమాచారం లేకపోయినా అంతాసిద్ధంగా ఉండాలని సోమవారం సిబ్బందికి సూచించారు.

'కొంగ' జపం!

జపం.. జపం.. జపం.. కొంగ జపం.. అంటే ఇదే అన్నట్టుగా కొంగలన్నీ కలిసి చెట్టుపైకి చేరి ఒక్కో కొమ్మను నివాసంగా చేసుకుని పగలు, రాత్రి కూడా అలానే ఉంటున్నాయి. చెట్టు నిండా కొంగలతో చూడచక్కని ఈ చిత్రం యానాంలో కనిపించింది.

-ఆంధ్రజ్యోతి, యానాం





యానాం నల్లచెరువును ఆనుకొని ఉన్న చెట్లపై సేదతీరుతున్న కొంగలు

నైట్రో సమైన్‌లను నిర్మూలిద్దాం...

క్యాన్సర్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

అంతర్జాతీయ సెమినార్‌లో 'నన్నయ' ఉప కులపతి ఆచార్య ప్రసన్నశ్రీ



జ్యోతిప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఫార్మాస్యూటికల్స్‌లో నైట్రోసమైన్‌లను నిర్మూలిస్తూ క్యాన్సర్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. నన్నయ వర్సిటీ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో 'ఫార్మాస్యూటికల్స్, విశ్లేషణాత్మక పరీక్షల్లో నైట్రోసమైన్‌ల నియంత్రణ' అంశంపై సోమవారం అంతర్జాతీయ సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ ప్రసన్నశ్రీ అతిథులతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి సెమినార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో చాలా మంది క్యాన్సర్‌తో బాధపడుతున్నారన్నారు. దీనికి జీవనశైలి, ఆహారం, పొగాకు, ఆల్కహాల్‌తో పాటు కలుషితమైన మందుల వాడకం కారణమని గుర్తు చేశారు. నైట్రోసమైన్ వంటి కొన్ని విషపూరిత మలినాలు ఆందోళన కలిగించేవిగా నిరూపితమయ్యాయన్నారు. నైట్రోసమైన్ రహిత మందులను అభివృద్ధి చేయడం ద్వారా నియంత్రించవచ్చన్నారు. మందుల వాడకంలో నియంత్రణ ఉండాలని చెప్పారు. ఫార్మాస్యూటికల్స్, అనలిటికల్ టెస్టింగ్‌లో నైట్రోసమైన్‌ల నియంత్రణ ద్వారా క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణానికి దోహదపడుతుందన్నారు. అమెరికాలోని ఫార్మాసూటికల్స్ క్వాలిటీ అస్యూరెన్స్‌డైరెక్టర్ డాక్టర్ విష్ణు మారిశెట్టి, నన్నయ వర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, మలేషియా ఐఎన్‌టీఐ అంతర్జాతీయ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ వి.రవి వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అమెరికాలోని కెమ్‌టెక్స్ లేబొరేటరీస్ శాస్త్రవేత్త డాక్టర్ నరేష్ కటారి ఆన్‌లైన్‌లో ఉపన్యసించారు. నన్నయ, గీతం వర్సిటీలతో పాటు పెర్కిన్ ఎల్మర్ సంస్థల నుంచి 12 మంది పోస్టర్ ప్రజెంటేషన్ చేశారు. సెమినార్‌లో ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, కన్వీనర్ బి.జగన్మోహనరెడ్డి, నన్నయ వర్సిటీ కెమిస్ట్రీ హెచ్‌వోడీ కె.దీప్తి, అధ్యాపకులు ఎస్.రామకృష్ణ, సీహెచ్ మురళీకృష్ణ, సీహెచ్ వెంకటపద్మారావు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన జేఎన్టీయూకే వీసీ



వర్సిటీలో చేపడుతున్న అభివృద్ధిని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వివరిస్తున్న వీసీ ప్రసాద్

జేఎన్టీయూకే, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్, చాన్సలర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను విజయవాడలోని రాజ్‌భవన్‌లో కాకినాడ జేఎన్టీయూ ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. వీసీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా గవర్నర్‌ను కలిసి వర్సిటీలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, విద్యాపరమైన అంశాలు, త్వరలో నిర్వహించనున్న విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ వేడుకల నిర్వహణపై చర్చించారు. గవర్నర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాకినాడ జేఎన్టీయూకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. సాంకేతిక విద్యలో రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు, విద్యా సంస్థలకు ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దాలన్నారు. వర్సిటీలో చేపడుతున్న మౌలిక వసతుల కల్పన, భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. సాంకేతిక రంగంలో మరిన్ని పరిశోధనలు చేపట్టేలా అధ్యాపకులను, రీసెర్చ్‌స్కాలర్స్‌ను, పీజీ విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. జేఎన్టీయూకే 11వ స్నాతకోత్సవ వేడుకలను త్వరలో నిర్వహించనున్నామని వీసీ ప్రసాద్ గవర్నర్‌కు వివరించారు. అంతే కాకుండా విద్యార్థుల సౌకర్యార్థం మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. అందరి సమిష్టి కృషితో జేఎన్టీయూకేను అభివృద్ధిపథంలో నడిపిస్తామని గవర్నర్‌కు వివరించారు.



ఈవో లక్ష్మీనారాయణ, అర్చకులకు వెండి అందజేస్తున్న దాత గోపాలకృష్ణమాచార్యులు

సర్పవరం భావనారాయణస్వామికి..

పది కిలోల వెండి వితరణ

సర్పవరం జంక్షన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సర్పవరంలోని శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామికి కాకినాడకు చెందిన సాతులూరి గోపాలకృష్ణమాచార్యులు పది కిలోల వెండి సమర్పించారు. దీనిని ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణకు అర్చకుల సమక్షంలో అందజేశారు. శ్రీమూల భావనారాయణస్వామికి వెండి మకరతోరణం చేయించాలన్న దాత కోరిక మేరకు వెండిని బ్రహ్మనికి ఇచ్చినట్టు ఈవో తెలిపారు. దాతకు ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పుల్ల శ్రీరాములు, ముద్దన ప్రకాశరావు, పుల్ల వీరబాబు, ఉద్యోగులు కుమార్, చందు పాల్గొన్నారు.



పెదపళ్ల గ్రామ దేవత పోలేరమ్మకు వెండి కిరీటం సమర్పించిన జాస్తి కుటుంబీకులు

పోలేరమ్మకు మూడు కిలోల

వెండి కిరీటం

ఆలమూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెదపళ్ల గ్రామ దేవత పోలేరమ్మకు గ్రామానికి చెందిన జాస్తి సుబ్బన్న-లక్ష్మీనరసమ్మ, సూరన్న-సత్యవతి, శ్రీరాములు-సూరమ్మ దంపతులు వారి వారసులు సుమారు రూ.3.40లక్షలతో మూడు కిలోల వెండితో కిరీటం చేయించారు. సోమవారం దానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి అలంకరించారు. జాస్తి భాస్కరరావు, జాస్తి వీర్రాజు, దాసరి శారదాంబ, జాస్తి వెంకటేశ్వరరావు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

'నన్నయ' హెల్త్ సెంటర్ అభివృద్ధికి రూ.15 లక్షల విరాళం

దివాన్‌చెరువు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం హెల్త్ సెంటర్ అభివృద్ధికి కాకినాడకు చెందిన ఎలైట్ నేచురల్ ఆయిల్స్ అండ్ ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తోట సుబ్రహ్మణ్యం రూ.15లక్షలు విరాళం ప్రకటించారని వీసీ ప్రసన్నశ్రీ తెలిపారు. సోమవారం విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన సుబ్రహ్మణ్యం.. తన తండ్రి హరిబాబు జ్ఞాపకార్థం ఈ విరాళం ప్రకటించినట్టు చెప్పారు. విశ్వవిద్యాలయంలో హెల్త్ సెంటర్‌ను విస్తరించి అభివృద్ధి చేయడానికి ఈ నిధులను వినియోగిస్తామన్నారు. ఈ సందర్భంగా దాతను ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు.



దాత సుబ్రహ్మణ్యానికి జ్ఞాపిక అందజేస్తున్న సత్కరిస్తున్న ఉప కులపతి ప్రసన్నశ్రీ



డెల్టా కాలువలకు

నీటి విడుదల పెంపు

ధవళేశ్వరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల కోసం ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు సాగునీటిని మరింత పెంచి 10,700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టాకు 3,200 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2,000 క్యూసెక్కులు, 5,500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. గోదావరిలో నీటి లభ్యత 10,391 క్యూసెక్కులుగా ఉండగా ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 10.10 అడుగులుగా నమోదైంది.

'టెన్'షన్!

పరీక్ష గదిలో సిమెంటు బస్తాలు

ఆందోళనకు గురైన విద్యార్థులు


పరీక్షా కేంద్రంలో ఎదురుచూస్తున్న విద్యార్థులు


సిమెంటు బస్తాలు తొలగిస్తున్న సిబ్బంది

అమలాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని నల్లవంతెన వద్ద గల ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష గదిలో సిమెంటు బస్తాలు ఉండడంతో కలకలం రేగింది. పరీక్షకు కొన్ని నిమిషాల ముందే ఆ గదిలో ఉన్న సిమెంటు బస్తాలను హడావుడిగా కార్మికులతో బయటికి మోయించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి బల్లలపై నంబర్లు సైతం వేసి ఉన్న 7వ నంబరు గదిలో కొన్ని బల్లలను పక్కకు పెట్టి సిమెంటు బస్తాలను భారీగా నిల్వ చేసిన తీరు చర్చనీయాంశమైంది. అదే గదిలో 22 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా వారిని బయట నిలుచోబెట్టి బస్తాలను క్లాస్ రూము నుంచి బయటికి హడావుడిగా తరలించారు. అయితే ఈ సమాచారం మీడియాకు చేరడంతో కలకలం రేగింది. అక్కడ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. బస్తాలు తొలగించిన అనంతరం ఏవిధమైన తుడుపు లేకపోవడంతో విద్యార్థులు బెంచీలను శుభ్రం చేసుకుని పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమాచారం తెలుసుకున్న డీఈవో సలీంబాషా ఆ పరీక్షా కేంద్రానికి చేరుకుని అక్కడి పరిస్థితులు పరిశీలించి విచారణకు ఆదేశించారు. అమలాపురం ఆర్డీవో కె.మాధవి, తహశీల్దార్ పి.అశోక్‌ప్రసాద్‌తో కలిసి డీఈవో ఆ పరీక్షా కేంద్రంలో సిమెంటు బస్తాలు తొలగించకపోవడానికి గల కారణాలు, ఇతర పరిస్థితులపై సహచర ఉపాధ్యాయులను విచారించారు. ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్టు సమాచారం. కాగా అమలాపురం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వద్ద పేరుకుపోయిన చెత్త కుప్పలను ఒక్కసారిగా పరీక్షా సమయానికి ముందే తగలబెట్టడంతో భారీగా పొగ కమ్మేసింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. పొగ వ్యాపించకుండా నీళ్లతో ఆర్పే ప్రయత్నాలుచేశారు.

'పది'కి ప్రేమతో..!

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా పరీక్షలు రాసేందుకు విద్యార్థులు పరుగులు తీశారు. అయితే కొన్నిచోట్ల దివ్యాంగులు పరీక్షలు రాసేందుకు పయనమవ్వగా వారిని తల్లిదండ్రులు ప్రేమతో, ఎంతో జాగ్రత్తగా పరీక్ష కేంద్రాలకు తీసుకొచ్చి పరీక్ష రాయించారు.


రాజమహేంద్రవరం చున్నీలాల్ జాజు హైస్కూల్‌కు దివ్యాంగురాలైన కూతురు నవ్యశ్రీని తీసుకొచ్చి పరీక్ష రాయించిన తండ్రి



తొండంగి: పెరుమాళ్లపురంలో ఎగ్జామ్ సెంటర్‌కు పోలియో కారణంగా కొడుకు కార్తీక్‌ను ఎత్తుకు తీసుకొచ్చిన తల్లి



రాజానగరం హైస్కూల్ పరీక్షా కేంద్రానికి దివ్యాంగులను తీసుకెళ్తున్న తల్లిదండ్రులు


అమలాపురంలో పరీక్షా కేంద్రం వద్ద కుమారుడికి తోడుగా వచ్చి జాగ్రత్తలు చెప్తున్న తల్లి





కాకినాడలో హాల్‌టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు, పరీక్షా కేంద్రం వద్ద తనిఖీలు

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి

మాస్టర్ ప్లాన్ సిద్ధం

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి


మాట్లాడుతున్న మంత్రి రామనారాయణరెడ్డి

అంతర్వేది, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది పుణ్యక్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. అత్యంత ప్రసిద్ధి చెందిన ఆలయం, మా ఇంట ఇలవేల్పు లక్ష్మీనరసింహస్వామి, మా ఇంట దేవత చెంచులక్ష్మి అని తెలిపారు. వేల ఎకరాల భూములు ఉన్నా శిస్తులు సరిగా రాక ఆదాయమార్గాలు సరి చేయడానికి అధికారులు, అర్చకులతో సోమవారం ముఖ్య సమావేశం నిర్వహించారు. ప్రధానంగా స్వామివారి ఆలయ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని చర్చించారు. ఆలయానికి ఈశాన్య భాగంలో రూ.3.5 కోట్లతో కోనేరు నిర్మాణానికి అంచనా వేశామన్నారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటి రహదారుల పరిశుభ్రతతో పాటు నూతన రహదారుల నిర్మాణం, ఉన్న రోడ్లను మెరుగుపరిచే విధానంలో మార్పులు చేయాలన్నారు. ఇప్పటికే 5,65 దేవాలయాలకు రూ.5వేలు ఇచ్చే విధానానికి ఎన్నికల హామీ ప్రకారం రూ.10వేలు అందించి ప్రతీ ఆలయంలోని ధూప దీప నైవేద్యాలకు కేటాయించామన్నారు. అదనంగా 150 దేవాలయాలను తీసుకున్నామని తెలిపారు. అలాగే అమలాపురం డివిజన్‌లో 74, రామచంద్రపురం 33, కొత్తపేట 62 మొత్తం 169 ఆలయాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలమేరకు రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని ఆలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌లు సిద్ధంచేసే విధంగా అధికారులను రిపోర్టు తయారుచేయమని ఆదేశించామన్నారు. అలాగే క్షేత్రపాలకుడు నీలంకంఠేశ్వరస్వామి ఆలయానికి కూడా కృషి చేస్తామని, ప్రస్తుతం రూ.4కోట్ల సీజీఎస్ ఫండ్‌తో ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ దాతలు 30శాతం అమౌంట్‌తో ముందుకు వచ్చినట్టయితే త్వరలోనే ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని స్థానిక నాయకులకు హామీ ఇచ్చారు. స్వామివారి ఆలయ భూములపై పురాతన కాలం నుంచి చేస్తున్న రైతులకు శిస్తు పెంచే ఆలోచనపై కలెక్టర్‌తో కమిటీవేసి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆలయంలో పనిచేసే నాయీబ్రాహ్మణులకు జీతాలు పెంపుపై వారు అడగ్గా రూ.20 నుంచి రూ.25వేల వరకు పెంచడానికి చర్యలు చేపడతామని మంత్రి ఆనం తెలిపారు.

దగ్ధమైన రథం పరిశీలన..

2020 సెప్టెంబరులో అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి రథం అగ్నికి ఆహుతి అవడం దురదృష్టకరమని మంత్రి అన్నారు. రథం శిథిలాలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. దగ్ధమైన రథం ఆలయ పరిసర ప్రాంతాల్లో ఐదేళ్లు ఉండడం శ్రేయస్కరం కాదని ఆగమ పండితులు వాపోయరన్నారు. కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్, ఆలయ అధికారులతో రథం ఘటనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రథాన్ని జలసమాధి చేయడానికి కార్యాచరణ చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫ్యామిలీ ఫౌండర్ మెంబర్, చైర్మన్ రాజాకలిదిండి కుమారరామగోపాలరాజాబహదూర్, డీసీ రమేష్‌బాబు, ఏసీ సత్యనారాయణ, దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, పోతురాజు కృష్ణ, గుబ్బల ఫణికుమార్ పాల్గొన్నారు.

కర్కశ తండ్రి!

- పిల్లలను కాలువతో తోసేసిన నాన్న
- కుమార్తె మృతి, కుమారుడు క్షేమం
- కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం

నెలపర్తిపాడు వద్ద ఘటన


కారుణ్య మృతదేహం

ఫైల్‌ఫొటో


వెంటూరులో రోధిస్తున్న తల్లి విజయ, కుమారుడు సందీప్

రాయవరం/ద్రాక్షారామ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఇటీవల ఓ తండ్రి తన ఇద్దరు కుమారులను హత్య చేసి, తాను ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో మరువక ముందే మరో తండ్రి తన ఇద్దరు పిల్లలను కాలువలోకి తోసేశాడు. కుమార్తె మృతిచెందగా కుమారుడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. కన్న బిడ్డలను కడుపులో పెట్టుకుని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన తండ్రి తన పిల్లలను కాలువలోకి తోసేశాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు శివారు గజపతినగరం వద్ద కాలువలో తోసేయగా ఈ సంఘటనలో కుమారుడు కాలువలో తుప్పలను పట్టుకుని నెమ్మదిగా ఒడ్డుకు చేరుకుని క్షేమంగా బయటపడగా, కుమార్తె కాలువలో కొట్టుకుపోయి మృతిచెందింది.

రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన పిల్లి రాజు ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అతడికి భార్య విజయ, పదేళ్ల కుమారుడు రామ్ సందీప్, ఏడేళ్ల కుమార్తె కారుణ్య ఉన్నారు. రామచంద్రపురంలో ఓ ప్రైవేటు పాఠశాలలో సందీప్ నాలుగో తరగతి చదువుతుండగా, కారుణ్య 1వ తరగతి చదువుతోంది. రాజు వెంటూరులో తన ఇంటి వద్ద నుంచి పిల్లలను రామచంద్రపురం పాఠశాలకు రోజు మాదిరిగా మోటార్‌సైకిల్‌పై తీసుకువెళ్లినట్టు సమాచారం. సోమవారం మధ్యాహ్నం పాఠశాల సమయం ముగిసిన తరువాత ఇంటికి పిల్లలను తీసుకువచ్చే క్రమంలో కాలువలోకి తోసేసినట్టు భావిస్తున్నారు. కుమారుడు సందీప్ తుప్పలను పట్టుకుని నెమ్మదిగా బయటపడి ఏడుస్తూ కేకలు వేయడంతో స్థానికులు చూడడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం సందీప్ తీవ్ర భయాందోళనకు గురై ఎటువంటి వివరాలు పూర్తిగా చెప్పలేకపోతున్నాడని గ్రామస్థులు చెబుతున్నారు. స్థానికుల సమాచారంతో ఎస్ఐ ఎం.లక్ష్మణ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సహాయంతో కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో కారుణ్య మృతదేహం లభించింది. రాజు ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు సీఐ వెంకటనారాయణ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

రాజు ఏమైనట్టు?


పిల్లి రాజు

పిల్లలను కాలువలో తోసేసిన తరువాత రాజు కాలువలో దూకేశాడా లేదా అక్కడ నుంచి పరారయ్యాడా అనే సందిగ్ధం గ్రామస్థులు, బంధువుల్లో నెలకొంది. రాజు గ్రామంలో అందరితో కలుపుగోలుగా మంచి గా ఉండేవాడని గ్రామస్థులు చెబుతున్నారు. వ్యాపార లావాదేవీల్లో కొంత నగదు రావాల్సి ఉండి, ఒత్తిడికి గురై ఇటువంటి ఘాతుకానికి పూనుకున్నాడా అనే అనుమానం వారి నుంచి వ్యక్తమౌతుంది.

వెంటూరులో విషాదఛాయలు

గ్రామంలో ఎప్పుడూ అందరితో కలుపుగోలుగా ఉండే రాజు తన పిల్లలను కాలువలో తోసేసిన ఘటనలో కుమార్తె కారుణ్య మృతి చెందడంతో వెంటూరులో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. భార్య విజయ, ఇతర కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఆరేళ్ల చిన్నారి మృతదేహాన్ని చూసి చలించిపోయారు. ఈసంఘటన స్థానికుల్ని తీవ్రంగా కలచివేసింది.

ఎంసీపీసీతో కేసుల సత్వర పరిష్కారం

న్యాయవాదులకు శిక్షణ ప్రారంభంలో పీడీజే గంధం సునీత


శిక్షణ తీసుకునే న్యాయవాదులతో పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం, రాజీ ప్రాజెక్టు కమిటీ (ఎంసీపీసీ) ఆధ్వర్యంలో కేసుల సత్వర పరిష్కారానికి అవకాశం ఉందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. ఎంసీపీసీ ఆధ్వర్యంలో న్యాయవాదులకు 5రోజుల పాటు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. సుప్రీం, హైకోర్టుల ఆదేశాలతో ఎంసీపీసీ విధానంపై న్యాయాధికారులు, న్యాయవాదులకు అవగాహనతో కూడిన శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. 36 మంది న్యాయవాదులకు 5 రోజుల పాటు 48 గంటలకు తగ్గకుండా తమిళనాడు నుంచి వచ్చిన మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇస్తున్నారన్నారు. ఈ శిబిరం 21వ తేదీతో ముగుస్తుందని చెప్పారు. విశాఖపట్నంలో జిల్లా ప్రధాన, ఇతర న్యాయమూర్తులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. కోర్టు సంబంధిత కేసుల్లో పరిష్కారానికి 4 విధానాలు ఉన్నాయన్నారు. దీనిలో మధ్యవర్తిత్వానికి సూచించిన కేసులకు శిక్షణ పొందిన జ్యుడీషియల్ అధికారులు, న్యాయవాదులను నామినేట్ చేయడం జరుగుతుందన్నారు. కేసుకు సంబంధించిన ఇరుపక్షాలనూ వాళ్ల పిలిపించి ఆమోదయోగ్యంగా ఉండే విధంగా మాట్లాడి ఒకటి, రెండు సిట్టింగుల్లో.. గరిష్ఠంగా 6 నెలల్లో రాజీ మార్గం ద్వారా కేసును పరిష్కరిస్తారన్నారు. దీనికి కూడా లోక్ అదాలత్ మాదిరిగా అప్పీల్‌కి అవకాశం ఉండదన్నారు. కోర్టుకు చెల్లించిన ఫీజును కూడా కక్షిదారులకు తిరిగి చెల్లించడం జరుగుతుందని చెప్పారు. ఇప్పుడు నిర్వహిస్తున్న వసతితో కూడిన శిక్షణకు తగిన ఏర్పాట్లు చేశామని పీడీజే తెలిపారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి కార్యదర్శి ఎస్‌కే జానీ భాషా, మాస్టర్ ట్రైనర్లు ఆర్.విజయ కమల, ఆర్.రత్నతార తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక.. కుటుంబాన్ని పోషించలేక..

కాకినాడలో వివాహిత ఆత్మహత్య


మరణించిన తలాటం స్వాతి (ఫైల్ ఫొటో)


రోధిస్తున్న కుటుంబ సభ్యులు

కాకినాడ క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మద్యానికి వ్యసనపరుడిగా మారిన భర్త పెట్టే వేధింపులు తాళలేక, కుటుంబ పోషణ భారంగా మారడంతో ఏంచేయాలో పాలుపోలేని స్థితిలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకెళితే కాకినాడ అర్బన్ ఎస్.అచ్చుతాపురం అంబేడ్కర్ కాలనీలో నివాసముంటున్న తలాటం సురేష్, స్వాతి (26) భార్యభర్తలు. వారిద్దరూ ఎమినిదేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఐదేళ్ల కొడుకు నిషాంత్, 6నెలల పాప శాన్వి సంతానం. భర్త కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య స్వాతి బీఫార్మసీ చేసి కరణంగారి సెంటర్‌లో గల అపోలో ఫార్మసీలో ఉద్యోగం చేస్తోంది. మద్యానికి వ్యసనపరుడైన భర్త డబ్బుల కోసం వేధించడం, కొట్టడం, దూషించడం వంటి వేధింపులకు పాల్పడుతుండటంతో పలుసార్లు తగాదాలు పడ్డారు. కొన్నాళ్లపాటు ప్రతాప్‌నగర్‌లో అద్దెకు ఉండేవారు. ప్రస్తుతం అత్తగారు ఇంటికి సమీపంలో అద్దెఇంట్లో నివాసం ఉంటున్నారు. సంపాదించిన డబ్బులు మద్యానికి ఖర్చుచేయడం, భార్య సంపాదించిన జీతం సైతం తీసుకుని తాగేయడంతో కుటుంబ పోషణ భారంగా ఉండడంతో ఏం చేయాలో పాలుపోలని స్థితిలో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ధారణకు వచ్చింది. ఆదివారం రాత్రి తన భర్త, ఇద్దరు పిల్లలు పడుకున్నాక సుమారు 2 గంటల ప్రాంతంలో బెడ్ రూమ్ పక్కన ఉన్న మరొక రూమ్‌లోకి వచ్చి ఫ్యాను పక్కన ఉన్న ఇనుపఉక్కికి చీరతో మెడకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తెల్లవారుజాము 3 గంటల సమయంలో పాప ఏడుస్తోండటంతో నిద్రలేచిన భర్త సురేష్ భార్య కోసం పరిశీలించాడు. పక్క గదిలోకి వెళ్లగా ఫ్యానుకు వేలాడుతూ విగతజీవిగా ఉండటాన్ని చూసి బంధువులు, పోలీసులకు సమాచారం అందించాడు. కాకినాడ టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు మృతదేహాన్ని పరిశీలించి పక్కన ఉన్న సూసైడ్ నోట్‌ని స్వాధీనం చేసుకున్నారు. ఆమె సెల్‌ఫోన్‌ని పరిశీలించగా అందులో తాను ఆత్మహత్య చేసుకోబోతున్నట్టు, భర్త సంపాదించిన డబ్బులు మద్యానికి పోయడం, ఉద్యోగం చేసిన తెచ్చిన జీతం డబ్బులను సైతం తీసేసుకుని రోజూ మద్యం తాగి వేధింపులకు పాల్పడడంతో ఏం చేయాలో పాలు పోక, భవిష్యత్తులో పిల్లలను ఎలా పెంచాలి, కుటుంబ పోషణ ఎలా చేయాలో తెలియక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సెల్ఫీ వీడియో సందేశాన్ని పరిశీలించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. సంఘటనా స్థలంలో సూసైడ్‌నోట్, సెల్ఫీ వీడియో స్వాధీనం చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించడం జరిగిందన్నారు. అభంశుభం తెలియని చిన్నారులను ఎవరు సాకుతారంటూ స్వాతి మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు రోదించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గోపాలపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతిచెందిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ కే.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గోపాలపురం గ్రామానికి చెందిన కొవ్వూరి నాగిరెడ్డి ఇంటి వద్ద నుంచి గోపాలపురం సెంటర్‌కు నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగిరెడ్డికి రెండుకాళ్లకు రక్తపు గాయాలు కావడంతో గోపాలపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తీసుకురాగా అప్పటికే నాగిరెడ్డి మృతిచెందినట్టు డ్యూటీ డాక్టర్ నిర్ధారించారు. అతడి కుమారుడు కొవ్వూరి జశ్వంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు వెదురుకర్రతో నిర్మాణాలు

రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

దివాన్‌చెరువు, మార్చి17 (ఆంధ్రజ్యోతి): అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు వెదురుకర్రతో నిర్మాణాలు చేపట్టేదిశగా అడుగులు వేయాలని రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ విజయకుమార్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా లాలాచెరువు అటవీ అకాడమీలో వెదురుసాగు విస్తీర్ణం పెంచడంపై ఔత్సాహిక రైతులు, ట్రేడర్స్‌కు సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ బాంబో మిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. పాత పద్ధతుల్లో బుట్టలు, తట్టలు, నిచ్చెనలు చేసే దగ్గర నుంచి ప్రస్తుతం భవనాల నిర్మాణాలు, బాంబో హోటల్స్, రిసార్ట్స్ వెదురుకర్రలతో ఏర్పాటు చేయవచ్చన్నారు. వెదురును వివిధ ఉత్పత్తుల ఆవిష్కరణ దిశగా రైతులు, వ్యాపారులు నైపుణ్యం పెంచుకోవాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బీఎస్ఎన్ మూర్తి అన్నారు. వెదురుతో తయారుచేసే ఉత్పత్తుల ఆవిష్కరణ దిశగా రానున్న రోజుల్లో గ్రామస్థాయిలో శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. మహారాష్ట్ర సింధూరు జిల్లాకు చెందిన కాన్‌బేక్ కంపెనీ చెందిన చైర్మన్ సహ వ్యవస్థాపకుడు సంజీవ్ శశికాంత్ కార్వే మాట్లాడుతూ వెదురుతో హోటల్, రిసార్ట్ నిర్మించినట్టు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి రవీంద్రధామ, డీఎఫ్‌వో శ్రీనివాస్, ఉద్యానశాఖ అధికారి డి.సుధీర్ కుమార్ తదితరులున్నారు.

లారీ ట్యాంకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఆత్మహత్య


బావిశెట్టి వెంకటేశ్వరరావు (ఫైల్)

సర్పవరం జంక్షన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ పండూరుకు చెందిన లారీ ట్యాంకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బావిశెట్టి వెంకటేశ్వరరావు (48) సోమవారం హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతంలో కొన్నేళ్ల పాటూ ట్యాంకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పని చేశాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో చేసిన అప్పులు తీర్చలేక ఇటీవలే తన పేరిట ఉన్న సుమారు 4 ఎకరాల భూమిని విక్రయించి అప్పులు తీర్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లో 2నెలలు ఉంటానని చెప్పి స్వగ్రామం నుంచి వెళ్లిన నెలరోజులకే ఇలా అర్థాంతరంగా ఆత్మహత్యకు పాల్పడతారని భావించలేదని వాపోయారు. మృతదేహం సోమవారం రాత్రికి స్వగ్రామం పండూరుకు చేరుకునే అవకాశం ఉందన్నారు. మృతుడికి ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడే అలవాటు ఉందని, ఆ బెట్టింగ్‌లో పెద్ద మొత్తంలో డబ్బులు నష్టపోవడం, డబ్బుల కోసం చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక, అసలు, వడ్డీ ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోవడంతో తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని విక్రయించి అప్పులు తీర్చినట్టు తెలిసింది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నాడు. కుమారుడు విజయనగరంలో ఎంబీబీఎస్ విద్యనభ్యసిస్తున్నాడు. బావిశెట్టి వెంకటేశ్వరరావు ఆత్మహత్య వార్త విన్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. అందరితో కలివిడిగా మాట్లాడే వెంకటేశ్వరరావు ఆత్మ హత్య చేసుకున్నాడన్న విషయం తెలిసిన తర్వాత షాక్‌కి గురయ్యానని, కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

స్నేహితుడి ఇంటికొచ్చి...కాల్వలో గల్లంతై!


గెడ్డం కార్తీక్ (ఫైల్‌ఫొటో)

కడియం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సరదాగా స్నేహితున్ని కలుద్దామని వచ్చాడు... కాసేపు మాట్లాడుకుని గ్రామంలో ఉన్న కాలువ వద్దకు స్నానానికి వెళ్లాడు. అంతలోనే గల్లంతయ్యారు. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం జేగురుపాడులో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఊబలంకకు చెందిన గెడ్డం కార్తీక్ (20), జేగురుపాడుకు చెందిన చందు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నారు. సోమవారం కార్తీక్ తన స్నేహితుడు చందు ఇంటికి జేగురుపాడు వచ్చాడు. ఇద్దరూ స్నానానికి అని జేగురుపాడులో ఉన్న కాల్వలోకి దిగారు. కానీ అంతలోనే కార్తీక్ గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కార్తీక్ కోసం గాలింపు చర్యలు చేయిస్తున్నారు. సీఐ ఏ.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి


సుబ్బారావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అంతర్వేది, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అప్పన రామునిలంకలో తిరుమాని సుబ్బారావు (59) రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. సోమవారం తెల్లవారు జామున 5.30గంటలకు తిరుమాని సుబ్బారావు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొని తలపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి భార్య తిరుమాని ముత్యాలమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొనడంతో మరొకరు..

అలాగే సఖినేటిపల్లి మండలం గుడిమూలకు చెందిన బత్తిన పైడిరాజు(23) సోమవారం సాయంత్రం 4గంటల సమయంలో మోటారుసైకిల్‌పై వెళ్తుండగా సినిమాహాలు సెంటర్‌లో కారు ఢీకొనడంతో ఎగిరి పక్కనున్న ప్రహరీ గోడపై పడి అక్కడికక్కడే మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. తండ్రి బత్తిన బంగార్రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఉపాధి నిమిత్తం సఖినేటిపల్లి మండలానికి వచ్చిన పైడిరాజు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

మహిళ మరణంపై వివాదం

కాకినాడ క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ మరణంపై వివాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే కాకినాడ జిల్లా తుని మండలం హంసవరం గ్రామానికి చెందిన పోతుల పాప (50) తీవ్ర శ్వాసకోస సమస్యతో ఈ నెల 12న కాకినాడలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరింది. పాపకు క్షయ, మధుమేహం కూడా ఉన్నాయని వైద్య పరీక్షల్లో గుర్తించారు. 3 రోజులుగా వార్డులో చికిత్స పొందుతున్న పాప ఆరోగ్యం సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా విషమించింది. దాంతో వైద్యులు ఆమెను ఐసీయూకీ తరలిస్తున్న క్రమంలో పాప మృతిచెందింది. ఈ ఘటనపై మృతురాలి కుటుంబ సభ్యులు భగ్గుమన్నారు. ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే పాప ప్రాణాలు కోల్పోయిందని, పాప మృతిపై ఆసుపత్రి యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని ఆందోళన చేశారు. అధికారులు, పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జనసేనలో సాధనాల చేరిక

అల్లవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి)మొగళ్లమూరు శివారు శిరగట్లపల్లికి చెందిన సాధనాల చినసత్యనారాయణ జనసేన పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీకి మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన సాధనాల మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో జనసేనలో చేరారు. జనసేనలో చేరిన సాధనాలను జనసేన నాయకులు అభినందించారు.

నగదు పురస్కారం అందజేత

యానాం,మార్చి17(ఆంధ్రజ్యోతి):యానాం పర్యాటక శాఖ ఆధీనంలోని సిగల్స్ సంస్థలో పనిచేస్తోన్న సిబ్బంది కుటుంబ సభ్యులకు నగదు పురస్కారాన్ని పుదుచ్చేరి పర్యాటక శాఖ అందజేస్తుంది. లంకే పకీర్‌రావు కుమారుడు లంకే కృష్ణావర్మకు పదో తరగతిలో ప్రతిభ సాధించినందుకు రూ.3వేలు పురస్కారాన్ని అందజేశారు.

డిమాండ్ల సాధనకు ఒంటి కాలిపై నిరసన



ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద 15వ రోజు ఒంటి కాలిపై నిరసన

ఓఎన్జీసీ స్పందించకపోతే ఆమరణ దీక్షలు

అల్లవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు గ్రామాన్ని దత్తత తీసుకోవాలని, స్థానిక యువతకు ఉపాధి కల్పించాలంటూ పదిహేను రోజులుగా ఆందోళన చేస్తున్నామని, ఇప్పటికైనా ఓఎన్జీసీ అధికారులు స్పందించకపోతే ఆమరణ నిరాహార దీక్షలు చేపడతామని గ్రామస్తులు అల్టిమేటం జారీ చేశారు. ఓడలరేవు ఓఎన్జీసీ ఆన్‌షోర్ టెర్మినల్ వద్ద గ్రామస్తులు చేపట్టిన నిరసన దీక్ష సోమవారం 15వ రోజుకు చేరింది. శిబిరంలో ఆందోళనకారులు ఒంటికాలిపై నిలుచుని నిరసన తెలిపారు. ఓడలరేవు గ్రామాభివృద్ధిచేసి రోడ్లు, ఆసుపత్రి భవనాలు నిర్మించాలని, యువతకు ఉపాధి, తీర ప్రాంత రక్షణ, ఓడలరేవును పర్యాటక కేంద్రం అభివృద్ధి చేయాలన్న డిమాండ్లతో గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారు. కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్‌బాబు, కొప్పాడి వెంకటరామకృష్ణారావు, గుండుమేను శ్రీనివాస్, రేకాడి శేషగిరి, కలిగితి ఏసుబాబు, పినపోతురామకృష్ణ, పి.ప్రకాష్, పెమ్మాడి వెర్రియ్య, పొన్నమండ ఏసుబాబు, అవనిగడ్డ వెంకట్రాజు, యిల్లింగి శ్రీను తదితరులు ఓఎన్జీసీ అధికారుల వైఖరికి ఒంటి కాలిపై నిలుచుని నిరసన దీక్షలు చేశారు.

ఆలయంలో మంత్రి రామనారాయణరెడ్డి పూజలు



మంత్రి రామనారాయణరెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు, అధికారులు

అంతర్వేది, మార్చి 17(ఆంధ్రజ్యోతి): నవనారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి సోమవారం దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విచ్చేశారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారి ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో స్వామివార్ని దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం అందించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం ఆలయ అధికారులు మంత్రికి అందించారు. డీసీ రమేష్‌బాబు, అప్సర వైస్‌చైర్మన్ నారాయణరెడ్డి, ఫ్యామిలీ ఫౌండర్ మెంబర్ రాజాకలిదిండి కుమారరామగోపాలరాజాబహుదూర్, కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్, ఏసీ వి.సత్యనారాయణ, దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, వనమాలి మూలాస్వామి, భైరా నాగరాజు, పోతురాజు కృష్ణ, రావూరి నాగు, ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్, డీటీ భాస్కర్, ఆర్ఐ రామరాజు పాల్గొన్నారు.

సారా నిర్మూలనతో నవోదయం : కలెక్టర్



ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్

అమలాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నాటుసారా నిర్మూలనే లక్ష్యంగా నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ముద్రించిన నవోదయం 2.0 గోడపత్రికను ఎక్సైజ్ అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తాగడం వల్ల ఎందరో చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. నాటుసారా సంపూర్ణ నిర్మూలనతోనే నవోదయం సాధ్యమవుతుందన్నారు. సారా అమ్మకమే వృత్తిగా జీవించే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లాలో ఎవరైనా నాటుసారా తయారుచేసినా, రవాణాచేసినా, నిల్వచేసినా, అమ్మకాలు జరిపినా చట్టరీత్యా నేరమని, ఇందుకు ఎనిమిదేళ్ల జైలుశిక్ష, రూ.5లక్షల వరకు జరిమానా విధిస్తారని కలెక్టర్ హెచ్చరించారు. ఎక్కడైనా నాటుసారా విక్రయిస్తున్నట్టు తెలిస్తే టోల్‌ఫ్రీ నంబరు 14405కు సమాచారం అందించాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్కేవీడీ ప్రసాద్ తెలిపారు. సమాచారం అందిచిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, జిల్లా అటవీ అధికారి ఎంవీ ప్రసాదరావు, ఏఈఎస్ జి.అమరబాబు, ఎక్సైజ్ సీఐలు వీటీవీవీ సత్యనారాయణ, కె.వీరబాబు, పి.శ్రీనివాసులు, కె.కాత్యాయని, వై.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రత్యేక సర్వే

మామిడికుదురు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కుటుంబలోను మహిళ ఆర్థిక స్వావలంబన దిశగా పయనించేలా సెర్ప్ ఆధ్వర్యంలో మండలంలో సోమవారం సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లాలోని మామిడికుదురు మండలంలో నగరం క్లస్టర్ పరిధిలో ఐదు గ్రామ పంచాయతీల్లో ఈ సర్వేను ప్రారంభించారు. పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నంలంక, నగరం, మొగలికుదురు గ్రామాల్లో ప్రతీ డ్వాక్రా గ్రూపు సభ్యురాలి అప్పు వివరాలు, కుటుంబ వివరాలు, 2025-26లో వారు నిర్వహించే జీవనోపాధుల కార్యక్రమంపై ఏవిధమైన రుణాలు ఎప్పుడు అవసరం అవుతాయని అనే ప్రణాళిక తయారు చేసేందుకు ఈ సర్వే చేస్తున్నట్టు డీపీఎం డీపీఎల్ అన్నపూర్ణ తెలిపారు. సర్వేలో నిర్వహించాల్సిన విషయాలను సర్వే సిబ్బందికి కూలంకుషంగా వివరించారు. సర్వేను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో డీపీఎం ఎ.గణేష్, ఏపీఎంలు విజయలక్ష్మి, ఎం.శామ్యూల్, డి.వరాలబాబు, సీసీ ఆనంద్‌బాబు, ఎంఎస్ అక్కౌంటెంట్ కె.నాగార్జున, వీవోఏలు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

● పరీక్షా కేంద్రాలు తనిఖీ చేసిన జేసీ నిషాంతి, డీఈవో సలీం బాషా







అమలాపురం: కామనగరువు జడ్పీ హైస్కూలు పరీక్షా కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న జేసీ నిషాంతి, అమలాపురం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల తరగతి గదిని పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి, డీఈవో సలీంబాషా, తహశీల్దార్ అశోక్, ముమ్మిడివరంలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

అమలాపురం రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అమలాపురం మండల విద్యాశాఖ పరిధిలో 11పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్షకు 2,267మంది విద్యార్థులకు 2259 మంది హాజరుకాగా ఎనిమిది మంది గైర్హాజరైనట్టు అమలాపురం ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం తెలిపారు. అమలాపురం శివారు కొంకాపల్లిలోని జవహర్‌లాల్‌నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలంచడంతో పాటు విద్యార్థులకు కల్పించిన మౌలిక వసతుల తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కామనగరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్షాకేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పరిశీలించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. వీటితో పాటు బండారులంక, వన్నెచింతలపూడి, పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు అమలాపురంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో 2కేంద్రాలు, మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూలు, శ్రీచైతన్య పాఠశాలల్లో కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ముక్తేశ్వరం, నేదునూరు, కొండుకుద్రు, కె.జన్నాథపురం, వీరవల్లిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు నిర్వహించారు. 695మంది విద్యార్థులకు తొలిరోజు 690మంది పరీక్షకు హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారి పి.శ్రీనివాస్ తెలిపారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఐదు సెంటర్లలో పదో తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగినట్టు ఎంఈవో ఎం.విజయశ్రీ తెలిపారు. 765మంది విద్యార్థులకు 760మంది పరీక్షలు రాసారని, ఐదుగురు పరీక్షకు హాజరుకాలేదన్నారు. మలికిపురం, విశ్వేశ్వరాయపురం, బట్టేలంక, కేశనపల్లి జిల్లాపరిషత్ హైస్కూళ్లల్లో పరీక్షలు జరిగాయి.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో సోమవారం పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జడ్పీ బాలుర, బాలికల అనాతవరం ఉన్నత పాఠశాల, అయినాపురం జడ్పీ హైస్కూలు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకేంద్రాల్లో 753మందికి 751మంది హాజరయ్యారు. ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ముమ్మిడివరం జడ్పీ బాలుర, బాలికల అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని పరిశీలనాధికారి ముప్పా రామలింగం, ఎంఈవోలు డి.గౌరీశంకర్, ఆర్.ఉదయభాస్కరరావులు తనిఖీలు నిర్వహించారు. మండలంలో ఎక్కడా ఎటువంటి మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీసు జరగలేదని ఎంఈవోలు తెలిపారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 591మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సిఉండగా 588మంది పరీక్షలకు హాజరయ్యారని ఎంఈవో కె.కిరణ్‌బాబు తెలిపారు. అల్లవరం-1,2, దేవగుప్తం, కొమరగిరిపట్నం హైస్కూళ్ల పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయని ఎంఈవో-2 ఎస్.ఏడుకొండలు తెలిపారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఐదు పరీక్షా కేంద్రాల్లో తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని మండల విద్యాశాఖాధికారి కె.హెలీనా తెలిపారు. నరేంద్రపురం, ముంగండ, నాగుల్లంక, పి.గన్నవరం, మానేపల్లి పరీక్షా కేంద్రాల్లో 790మంది విద్యార్థులకు 786మంది హాజరుకాగా నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. ఆయా కేంద్రాల వద్ద అన్నిఏర్పాట్లు పూర్తిచేశామని, తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఎంఈవో తెలిపారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అన్ని కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని డీఈవో ఎస్కే సలీమ్‌బాషా తెలిపారు. అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మండలంలో అంబాజీపేట, తొండవరం, పుల్లేటికుర్రు హైస్కూల్స్‌లో జరిగిన తెలుగు పరీక్షకు 456మంది విద్యార్థులకు 452మంది హాజరైనట్లు ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆయా కేంద్రాల్లో అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లవిల్లి, చల్లపల్లి, భీమనపల్లి, ఎన్.కొత్తపల్లి కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. నాలుగు కేంద్రాలకు సంబంధించి 589మందికి 584మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్టు ఎంఈవో సత్తి సత్యకృష్ణ తెలిపారు. ప్రత్యేక ప్రతిభావంతులకు పరీక్ష రాసేందుకు అనువుగా ఏర్పాట్లు చేశామన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో రామేశ్వరం, లూథరన్, అంతర్వేదిపాలెం, కేశవదాసుపాలెం, మోరి హైస్కూళ్లలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 703మంది విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల నుంచి ముగ్గురు, ప్రభుత్వపాఠశాలల నుంచి ఇద్దరు హాజరు కాలేదని ఎంఈవోలు డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): రాజోలు మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయని ఎంఈవో ఎన్.మనోహరం తెలిపారు. 720 మంది విద్యార్థులకు 715 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, ఐదుగురు గైర్హాజరయ్యారని తెలిపారు. రాజోలు జిల్లా ప్రజాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలల్లో 158మంది విద్యార్థులకు 157మంది హాజరయ్యారని, బాలికల పాఠశాలలో 159మందికి 159మంది, శివకోడు జిల్లాప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో 106మందికి 106మంది, కడలి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠాలలో 162మందికి 159మంది, పొన్నమండ జిల్లాప్రజాపరిషత్ పాఠశాలలో 135మందికి 134మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

యానాం, (ఆంధ్రజ్యోతి): యానాంవిద్యాశాఖ పరిధిలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. యానాం రీజెన్సీ పబ్లిక్ స్కూల్‌లో రెండు సెంటర్లు ఏర్పాటుచేశారు. సెంటర్ ఏలో 230 మంది, సెంటర్ బీలో 193మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. యానాం ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్‌సీ సిలబస్ కావడంతో ఇప్పటికే పది పరీక్షలు పూర్తయ్యాయి. ప్రైవేటు పాఠశాలలు స్టేట్‌బోర్డు సిలబస్ కావడంతో వారికి సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్షకు నూరుశాతం విద్యార్థులు హాజరయ్యారు. సెంటర్ ఏకి చీఫ్ సూపరింటెండెంట్‌గా పంపన కృష్ణామూర్తి, సెంటర్ బీకి ఎన్.సుబ్రహ్మణ్యం, డీవోగా సత్యనారాయణ, సీహెచ్ శ్రీనివాస్‌లు వ్యవహరిస్తున్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు మండలంలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారం 1053మంది విద్యార్థులకు 1040 మంది పరీక్షకు హాజరయ్యారని, 13మంది గైర్హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారులు తెలియచేశారు.

ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభం



మూల్యాంకనం చేసే అధ్యాపకుల సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో సోమశేఖరరావు

అమలాపురం టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థుల బ్రిడ్జి కోర్సు పరీక్షలు 11 పరీక్షా కేంద్రాల్లో సోమవారం ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. 2336మంది విద్యార్థులకు 1908మంది హాజరు కాగా 428 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు తెలిపారు. అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభం సందర్భంగా అధ్యాపకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. తెలుగు, హిందీ, ఇంగ్లీషు, గణితం, పౌరశాస్త్రం సబ్జెక్టులకు సంబంధించి జవాబు పత్రాలను సోమవారం నుంచి మూల్యాంకనం చేయడం ప్రారంభించామన్నారు. మూల్యాంకనం సమయంలో ఎవరూ సెల్‌ఫోన్లు వినియోగించరాదని స్పష్టం చేశారు. జవాబు పత్రాలను జాగ్రత్తగా పరిశీలిస్తూ మార్కులు వేయాలన్నారు. సమావేశంలో క్యాంపు బాధ్యతలు నిర్వహిస్తున్న వై.లక్ష్మణరావు, ఎం.రామారావు, డి.శ్రీనివాస్, సువర్ణకుమార్, శాంతకుమారి, అడబాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్షయవ్యాధి రహిత సమాజమే లక్ష్యంగా పనిచేయాలి

డీఆర్వో రాజకుమారి



క్షయవ్యాధి నివారణ కోసం కృషి చేస్తున్న వారితో డీఆర్వో రాజకుమారి

అమలాపురం టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి రహిత సమాజమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పనిచేయాలని డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో క్షయవ్యాధి నివారణపై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. క్షయవ్యాధిపై అపోహలు తొలగించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వ్యాధి నివారణాశక్తి లోపం కారణంగా టీబీ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. అనుమానిత రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యం అందిస్తున్నామన్నారు. ఐఎంఏ జిల్లాశాఖ ప్రతినిధి డాక్టర్ జేఏస్ శివకుమార్ మాట్లాడుతూ క్షయ అంటు వ్యాధి అని, ఇది గాలి ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందుతుందన్నారు. క్షయవ్యాధి నివారణకు అవసరమైన మందులను వినియోగించడం ద్వారా తగు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చునని క్షయవ్యాధి నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ భరతలక్ష్మి తెలిపారు. క్షయవ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. వ్యాసరచన పోటీల విజేతలకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందించారు. క్షయవ్యాధి నివారణకు కృషి చేస్తున్న సభ్యులను డీఆర్వో అభినందించారు. డాక్టర్ పీఎస్ శర్మ, వైటీ నాయుడు, డాక్టర్ పి.సురేష్, పోలిశెట్టి అంతనలక్ష్మి పాల్గొన్నారు.

వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదంపై నిరసన



అమలాపురం టీడీపీ కార్యాలయాన్ని ముట్టడించిన మాలమహానాడు నాయకులు

అమలాపురం టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం తెలపడాన్ని నిరసిస్తూ మాలమహానాడు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు క్యాంపు కార్యాలయాన్ని నాయకులు ముట్టడించి ధర్నా చేపట్టారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే మాట్లాడాలంటూ నినాదాలు చేశారు. మాలమహానాడు నాయకులు పండు అశోక్‌కుమార్, జల్లి శ్రీనివాస్, నాతి శ్రీనివాసరావు, పరమట రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



అమలాపురం రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేసవి ఉష్ణోగ్రతలు పెరగడంతో చిందాడగరువు గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు మోటూరి కనకదుర్గ-వెంకటేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అర్జీదారుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రారంభించారు. అర్జీదారులకు కలెక్టర్ స్వయంగా మజ్జిగను పంపిణీ చేశారు. మూడేళ్లుగా వేసవి సీజన్‌లో కనకదుర్గ-వెంకటేశ్వరరావు దంపతులు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేస్తుండడం పట్ల కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మలేషియా ఎన్నారై బృందం

మామిడికుదురు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మలేషియాలో చిక్కుకుపోయి ఇబ్బందులు పడుతున్న కాకినాడ జిల్లా ఏలేశ్వరానికి చెందిన గంగలకుర్తి చంద్రావతిని స్వదేశానికి రప్పించడంలో మలేషియా ఎన్నారై బృందం మానవత్వం చాటుకుంది. ఏజెంట్ మోసంతో మలేషియాలో చిక్కుకుపోయిన చంద్రావతి కుటుంబ సభ్యులు జనసేన పార్టీ నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మలేషియా జనసేన బృందం ఫౌండర్ అయిన మగటపల్లి గ్రామానికి చెందిన బొలిశెట్టి శ్రీరామ్‌ను సంప్రదించారు. దీంతో ఆయన మలేషియాలో భారతీయ రాయబారిశాఖ అధికారితో మాట్లాడారు. అక్కడ అధికారులు వేసిన జరిమానాలు చెల్లించి మలేషియా నుంచి విశాఖపట్నం వరకు విమాన టిక్కెట్‌ను తీసి పంపించారు. ఆమెను ఇంటికి పంపించడానికి రూ.1.20లక్షలు ఖర్చు చేశారు. స్వదేశానికి రావడానికి యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆర్థికసాయాన్ని అందించినట్టు శ్రీరామ్ తెలిపారు. మలేషియాలో ఇబ్బందులు పడుతున్న భారతీయులను ఆదుకోవడానికి మలేషియా జనసేన టీమ్ ఎప్పుడూ ముందు ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

అపరిష్కృత సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘ సమస్యలు పరిష్కరించాలని ముమ్మిడివరం తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ కోరింది. పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు రెడ్డి వీరాస్వామి ఆధ్వర్యంలో పెన్షనర్లంతా తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రాన్ని అందించారు. డీఏ, పీఆర్సీ బకాయిలు, పీఎఫ్‌కు సంబంధించి గ్రూపు ఇన్సూరెన్సు, హెల్త్‌కార్డులకు సంబంధించి 2018నుంచి ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పన్నెండో పీఆర్సీని వెంటనే నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని వారు కోరారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి రాము, వైవీ రమణమూర్తి, జనిపల్లి సత్యనారాయణ, ఏవీ సత్యనారాయణ, కోలా వెంకటేశ్వరరావు, పి.రామదాసు, బి.వరప్రసాదరావు, బి.కృష్ణమూర్తి, కె.సత్యనారాయణ, కె.నాగేశ్వరరావు, టి.సత్యనారాయణ, పి.లక్ష్మణేశ్వరరావు, వి.మధుసూదనరావు, ఎన్.అబ్బులులతో పాటు విశ్రాంత, ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు.

టెన్త్ విద్యార్థులకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

ఐ.పోలవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో టెన్త్ పరీక్షలకు సంబంధించి రెండు పాఠశాలల విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం కల్పించింది. జి.మూలపొలం, జి.వేమవరం హైస్కూల్ విద్యార్థులు ఐ.పోలవరం జడ్పీ హైస్కూల్లో పరీక్షలకు హాజరవుతున్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు అమలాపురం ఆర్టీసీ డిపో ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటు చేసింది. డీఈవో సలీంబాషా, ఎంఈవోలు కొండారెడ్డి, సురేష్‌బాబు, తహసీల్దార్ చిక్కాల విజయశ్రీ డిపో మేనేజర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

11 కిలోల పండుగొప్ప



అంతర్వేది, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బరులో మత్స్యకారుల వలకు చిక్కిన 11కిలోల పండుగొప్పను కొనుగోలు దారులు రూ.6వేలకు కొనుగోలు చేశారు. ఇటీవల మత్స్యకారులకు భారీ టేకు, సొర, పండు చేపలు వలకు చిక్కుతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

యానాం,మార్చి 17(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం ఆర్ఏ కార్యాలయంలో యానాం పరిపాలనాధికారి, ఓటర్ల నమోదు అధికారి ఆర్.మునిస్వామి సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించిన అంశాలు, గతంలో లేవనెత్తిన అంశాలు, ఓటర్ల జాబితా తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, అన్నడీఎంకే కార్యదర్శి మంచాల సత్యసాయికుమార్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అర్థాని దినేష్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బాలమ్మకు రూ.26లక్షల వెండి మకరతోరణం



అమలాపురం టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అమలాపురం గ్రామదేవత శ్రీసుబ్బాలమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని సోమవారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో హోమాది క్రతవులు నిర్వహించారు. దాతలు సమకూర్చిన రూ.26లక్షలతో 26కిలోల వెండిని ఉపయోగించి తయారుచేసిన మకరతోరణాన్ని అశ్వవాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

కోదండరామస్వామి ఆలయ వార్షికోత్సవం

అంబాజీపేట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక చప్పిడివారిపాలెంలో ఉన్న కోదండరామస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

మాజీ ఎంపీపీకి నివాళి

మలికిపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ వీబీఎస్ గోలపారావు మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులను మాజీ డిప్యూటీ స్పీకర్ ఏవీ సూర్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా, టీడీపీ నాయకులు అడబాల యుగంధర్, అడబాల సాయిబాబు, శంకరగుప్తం సర్పంచ్ రాపాక ఆనందకుమార్, ఎంపీటీసీ ఆచంట మాణిక్యం, నీటిసంఘం అధ్యక్షుడు రాపాక మల్లికార్జునరావు తదితరులు పరామర్శించారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి

పి.గన్నవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మొండెపులంక గ్రామంగోదావరి ప్రక్కన ఉన్న లంకభూముల్లో ఉన్న ఇసుకను కొందరు అక్రమంగా రాత్రి సమయాల్లో సొంత వాహనాల్లో రవాణా చేస్తున్నారని, వీటిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌తో పాటు సీసీఎఫ్ సభ్యులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో తహశీల్దారుకు వినతిపత్రాన్ని అందించారు. లంక భూముల్లో ఉన్న ఇసుకను క్రేన్ల సాయంతో ఒకే చోటకు చేర్చి వాటిని అధిక ధరలకు ఉంద్రాజవరపు ఏడుకొండలు, రాజేష్, పండు, రమణ, రాజు, బన్నిలు విక్రయిస్తున్నారని వారు ఆరోపించారు. సర్పంచ్ గుడాల రామారావు, ఎస్ఎస్ఎఫ్ సొసైటీ ప్రెసిడెంట్ చిల్లే మోహనరావు, గ్రామస్థులు వినతిపత్రాన్ని అందించారు.

భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ శిబిరం

రాజోలు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాజోలు భవిత కేంద్రంలో ప్రతీ సోమవారం ఫిజియోథెరపి శిబిరాన్ని నిర్వహిస్తున్నామని సమగ్రశిక్ష సీఎంవో బి.సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగవైకల్యం గల పిల్లల తల్లిదండ్రులు భవిత కేంద్రంలో ఫిజియోథెరపి అందించే సేవలను వినియోగించుకోవాలని కోరారు. పిల్లలను భవిత కేంద్రానికి తీసుకుని వచ్చేవారికి ఎస్కార్ట్ అలవెన్సు ఇస్తామని తెలిపారు. ఐఈఆర్టీలు అందించే స్పీచ్ థెరపీ, కంప్యూటర్ నైపుణ్యాలు వంటి సౌకర్యాలను కూడా విభిన్న ప్రతిభావంతుల తల్లిదండ్రులు వినియోగించుకోవాలన్నారు. ఫిజియోథెరపిస్ట్ ఎం.ఝాన్సీ, ప్రధానోపాధ్యాయురాలు ఓ.అన్నపూర్ణ, ఐఈఆర్టీలు సుబ్బలక్ష్మి, అనిత పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం

ఉప్పలగుప్తం, మార్చి17(ఆంధ్రజ్యోతి): అమలాపురం- చల్లపల్లి ప్రధాన పంటకాల్వలో సరిపల్లి గ్రామపరిధిలో సోమవారం గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. మృతదేహం 50-55ఏళ్ల పురుషునిదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చలమల రాజేష్ తెలిపారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): గోగన్నమఠం గ్రామంలోని ఓ చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందని నగరం హెడ్ కానిస్టేబుల్ కుమార్ తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడి వయసు 42 ఏళ్లు ఉంటుందని, సమీప పోలీసుస్టేషన్‌లో నమోదైన మ్యాన్ మిస్సింగ్ కేసుల వివరాలు సేకరిస్తున్నారు.

మోకాళ్ల చిప్పకు శస్త్రచికిత్స



శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యుల బృందం

పి.గన్నవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మోకాళ్ల వ్యాధితో బాధపడుతున్న రాజోలు మండలానికి చెందిన మల్లాడి నాంచారావుకు పి.గన్నవరం సీహెచ్‌సీలో అరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఆర్థో డాక్టర్ యూ.రాఘవేంద్రరావు, మత్తు డాక్టర్ అప్పారి సూర్యనారాయణ, కోఆర్థో డాక్టర్ గురుపప్రసాద్ ఆధ్వర్యంలో మొకాళ్లకు అరుదైన ఆపరేషన్ చేశారు. ఈఆపరేషన్ విజయవంతమైందని డాక్టర్ రాఘవేంద్రరావు తెలిపారు. వైద్య సిబ్బంది రాజకుమారి, నరసింహరాజు, మణితేజ పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రుడి సంబరం

మామిడికుదురు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పెదపట్నంలంకలో కొమ్ముల సత్యం కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో 105ఏళ్ల నుంచి వీరభద్రస్వామి సంబరాన్ని ఏటా ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం కూడా సత్యం కుటుంబానికి చెందిన కొమ్ముల హిమైచరణ్ ఆధ్వర్యంలో వీరభద్రుని సంబరాన్ని వైభవంగా జరిపారు. ముందుగా బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం, మేళతాళాలతో భారీగా ఊరేగింపు చేస్తూ గోదావరి నది వరకు తీసుకువెళ్లారు. అక్కడ నదీ తీరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శతాబ్ద చరిత్ర కలిగిన వీరభద్రుని సంబరాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

స్వామివారి నిత్యాన్నదానానికి రూ.10వేలు విరాళం

అయినవిల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి నిత్యాన్నదాన పథకానికి నీలపల్లి గ్రామస్తులు చింతలపూడి నీలవెంకటరత్నరమేష్ కుటుంబ సభ్యులు సోమవారం రూ.10,116 విరాళంగా అందించారు. తొలుత రత్నరమేష్ కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వారికి వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం బహూకరించారు.

మండపేట

అంకాలమ్మ చెరువుకు మోక్షం

● నాలుగేళ్ల తర్వాత పూడికతీత పనులకు శ్రీకారం


చెరువును శుభ్రం చేస్తున్న ఉపాధి హామీ పథకం కూలీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మండపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వై.సీతానగరంలోని అంకాలమ్మ చెరువుకు గత నాలుగేళ్లుగా కనీస మరమ్మతులు, పూడికతీత పనులు చేపట్టకపోవడంతో వృథాగా పడి ఉండేది. దీంతో ఇందులో మత్స్యకారులు చేపలను పెంచుకునేవారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్లే వ్యర్థాలు పేరుకుపోయాయని పలువురు వాపోయారు. ప్రస్తుత ప్రభుత్వం చెరువులో పూడికతీత పనులను సోమవారం ప్రారంభించింది. దీనిపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో అంకాలమ్మ చెరువుకు మోక్ష మెప్పుడో అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉపాధి హామీ పథకం ఏపీడీ మాట్లాడుతూ పూడికతీత పనులు చేపట్టి చెరువు గట్టును పటిష్ఠం చేస్తామని చెప్పారు.

వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి

● శాసనమండలిలో ధ్వజమెత్తిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



మండపేట, మార్చి17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థను వినియోగించుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ఆ వ్యవస్థను రద్దు చేయడంపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సోమవారం శాసనమండలిలో ప్రశ్నించారు. విజయవాడకు వరదలు వచ్చిన సమయంలో వారి సేవలను వినియోగించుకుని ... అన్యాయంగా వదిలేయటం దారుణమన్నారు. దీనిపై రాష్ట్రప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నోత్తరాల సమయంలో ప్రశ్నించారు. తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.


మార్చి రెండో వారంలోనే ఎండలు మండిపోతున్నాయి. ఉదయం పది గంటలకే 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. దీంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండను తాళలేక ముసుగేసుకుంటూ మహిళలు వెళ్తుండగా, మండపేటలోని ఓ కాలువలో చిన్నపిల్లలు ఇలా జలకాలాడుతూ సోమవారం కనిపించారు.
– మండపేట, ఆంధ్రజ్యోతి

జనసేన పార్టీలో చేరిక

అల్లవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మొగళ్లమూరు శివారు శిరగట్లపల్లికి చెందిన సాధనాల చినసత్యనారాయణ జనసేన పార్టీలో సోమవారం చేరారు. మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన తర్వాత రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు అభినందించారు.

తొలిరోజు 'పది' పరీక్షలు ప్రశాంతం

● ఐదుగురు విద్యార్థులు గైర్హాజరు

మండపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం ఐదుగురు విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదని ఎంఈవోలు నాయుడు రామచంద్రరావు, సోమిరెడ్డి చెప్పారు. మండలంలో నాలుగు, పట్టణంలో ఐదు సెంటర్లను కేటాయించారు.

రాయవరం: మండలంలో పది పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు స్థానిక శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే పసలపూడి, చెల్లూరు జడ్పీ హైస్కూల్లో కూడా జరిగాయి. మండలంలోని ఎనిమిది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఐదు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 691 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సిఉండగా, నాలుగు పరీక్షా కేంద్రాల్లో ఏడుగురు గైర్హాజరయ్యారు. పసలపూడి హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని రామచంద్రాపురం ఆర్డీవో డి.అఖిల, ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు.

కె.గంగవరం: దంగేరు, గంగవరం, కోటిపల్లి, పామర్రు పరీక్షా కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. పామర్రులో 165 మంది, దంగేరులో 133 మంది, కోటిపల్లిలో 70 మంది, గంగవరంలో 85 మం దికి 84 మంది పరీక్షలు రాశారు. గంగవరం పరీక్షా కేంద్రంలో ఒక విద్యార్థి పరీక్షకు హాజరు కాలేదని ఎంఈవో ఏ.నాగరాజు, ఎంఈవో-2 సీహెచ్ ఆంజనేయులు చెప్పారు. సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, కపిలేశ్వరపురం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సోమవారం నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఆయా కేంద్రాలను ఎంఈవో కె. తాతారావు పరిశీలించారు. అంగర ఏబీ సెంటర్లలో మొత్తం 314 మంది విద్యార్థులకు గాను 313 మంది హాజరయ్యారు. అలాగే కపిలేశ్వరపురంలో 133 మందికి గాను 133 మంది హాజరైనట్లు పరీక్షా కేంద్రాల సీఎస్‌లు వీ.శ్రీనివాస్, బీ. సురేంద్రచౌదరి, ఎం. సూర్యనారాయణ, డీవోలు చినబాబు, కె. రాంబాబు, వై. రాధాకృష్ణ తెలిపారు.


మండపేట మండలం తాపేశ్వరం హైస్కూల్ వద్ద విద్యార్థుల సందడి


రాయవరం పరీక్షా కేంద్రం వద్ద హాల్‌టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు


కే.గంగవరంలో నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు


కపిలేశ్వరపురంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం


పామర్రులో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

నూకాలమ్మ జాతర మహోత్సవాలకు శ్రీకారం


కపిలేశ్వరపురంలో గరగబుట్టను ఊరేగిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కపిలేశ్వరపురంలో కొలువై యున్న నూకాలమ్మ వారి జాతర మహోత్సవాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అమ్మవారి గరగబుట్టను గ్రామంలో డప్పువాయిద్యాలతో ఊరేగించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్న భక్తులు పసుపు, కుంకుమ, గాజులు, నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి జాతరకు అంగర, కపిలేశ్వరపురం, గ్రామాల్లోని నూకాలమ్మ వారి ఆలయాలను రంగురంగులతో తీర్చిదిద్ది విద్యుత్ దీపాలతో అలంకరించారు.

వీధిలైట్లు వెలిగించరూ... !

కె.గంగవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గుడిగళ్లభాగలో వీధి లైట్లు వెలగకపోవడంతో వీధులన్నీ అంధకారంగా మారాయి. ఈ గ్రామం పూర్తిగా వ్యవసాయ పొలాల మధ్య ఉండటంతో చీకటిపడితే చాలు పొలాల నుంచి పాములు రోడ్లపైకి వస్తుంటాయి. దీంతో రాత్రిపూట బయటకు వెళ్లాలంటే గ్రామస్థులు భయపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు నానాయాతన పడాల్సిన పరిస్థితి ఉంది. దీనిపై పంచా యతీ అధికారులకు పలుమార్లు విన్నవించినా...సమస్య పరిష్కారం కావడం లేదని వారంతా వాపోతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటర్ మూల్యాంకనం ప్రారంభం

అమలాపురం టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థుల బ్రిడ్జి కోర్సు పరీక్షలు 11 పరీక్షా కేంద్రాల్లో సోమవారం ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. 2336 మంది విద్యార్థులకు గాను 1908 మంది హాజరు కాగా , 428 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభం సందర్భంగా అధ్యాపకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. తెలుగు, హిందీ, ఇంగ్లీషు, గణితం, పౌరశాస్త్రం సబ్జెక్టులకు సంబంధించి జవాబు పత్రాలను సోమవారం నుంచి మూల్యాంకనం చేయడం ప్రారంభించామన్నారు.

తుప్పల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

● తరచూ ట్రిప్ అవుతున్న వైనం
● విద్యుత్ సరఫరాలో అంతరాయం
● ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతుల ఆవేదన


వెలిచేరులో తుప్పల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఆత్రేయపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో తరుచు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుంది. వెలిచేరు నుండి రాజవరం వెళ్ళే ఆర్అండ్‌బీ రోడ్డు చెంతనే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు తుప్పలు పెరిగిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్ నుండి వెళ్ళే వైర్లకు పిచ్చిమొక్కలు తాకడంతో విద్యుత్ ట్రిప్ అయ్యి తరుచు అంతరాయం ఏర్పడుతుంది. ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిచ్చిమొక్కలను తొలగించి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్‌కో ఉన్నతాధికారులను ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం


ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,02,170 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అలాగే క్షేత్రపాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శివుడికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఈవో క్షేత్రంలోని పలు విభాగాలను, లైన్ల విస్తరణ పరిశీలించారు. స్వామివారి గోక్షేత్రంలో పర్యటించి సిబ్బందికి పలు సూచనలు అందజేశారు.

జాతీయ కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


కరాటే పోటీల్లో విజేతలైన సిద్ధార్థ విద్యార్థులు

ఆలమూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన జాతీయస్థాయి కరాటే, తైక్వాండో కుంగ్‌ఫూ పోటీల్లో ఆలమూరులోని శ్రీసిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. బ్రౌన్‌బెల్ట్ కటాస్ ఏ.విభాగంలో గెద్దాడ జాయ్ కిరణ్, బ్లూబెల్ట్ విభాగంలో జి.షణ్ముఖ్. ఎల్లో విభాగంలో బండి దైవీక్‌ఆశీష్ గోల్డ్‌మెడల్స్ సాధించినట్టు కోచ్ టి.అబ్బులు టి.వెంకటలక్ష్మి తెలిపారు. అలాగే కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి బుంగ అశ్విన్ బ్రౌన్‌బెల్ట్ విభాగంలో గోల్డ్‌మెడల్, ఎల్లో విభాగంలో జీఎస్ఎం మణికంఠ సిల్వర్‌మెడల్ సాధించినట్టు చెప్పారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శ్రీసిద్ధార్థ హైస్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు, కోచ్‌లు అభినందించారు.

కలెక్టరేట్ వద్ద
మజ్జిగ చలివేంద్రం

అమలాపురం రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేసవి ఉష్ణోగ్రతలు పెరగడంతో చిందాడగరువు గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు మోటూరి కనకదుర్గ-వెంకటేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అర్జీదారుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రారంభించారు. అర్జీదారులకు కలెక్టర్ స్వయంగా మజ్జిగను పంపిణీ చేశారు. గత మూడేళ్లుగా వేసవి సీజన్‌లో కనకదుర్గ-వెంకటేశ్వరరావు దంపతులు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేస్తుండడం పట్ల కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు ప్రశాంతం


ఆలమూరులో పరీక్షలు రాయడానికి వెళ్తున్న విద్యార్థులు

ఆలమూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు సోమవారం ఆలమూరు మండలంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 216మంది, ఆలమూరు జడ్పీ గరల్స్ హైస్కూల్ 210మంది,చెముడులంక జడ్పీ హైస్కూల్లో 256మంది పరీక్షలు రాసేందుకు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎంఈవో బి.అప్పాజీ తెలిపారు. ఆలమూరులోని రెండు కేంద్రాల్లో నూరుశాతం విద్యార్థులు హాజరు కాగా చెముడులంక కేంద్రంలో ఇద్దరు హాజరు కాలేదని చెప్పారు.

నలుగురు గైర్హాజరు

ఆత్రేయపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలంలో తొలిరోజు పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహించారు. పరీక్షలకు 567 మంది విద్యార్థులకు గాను 563 మంది హాజరు కాగా నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ర్యాలీ, ఆత్రేయపురం, పేరవరం కేంద్రాలను మండల విద్యాశాఖాధికారులు వరప్రసాద్, సాహెబ్ పరిశీలించారు. గత ఏడాది పరీక్ష తప్పిన నలుగురు విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం
పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు

నలుగురు విద్యార్థులు గైర్హాజరు

కొత్తపేట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్షా కేంద్రాలలో 918 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా వానపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో నలుగురు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. దీంతో 914 మంది హాజరైనట్టు ఎంఈవోలు ఎం.హరిప్రసాద్ తెలిపారు. కాగా అవిడి, చప్పిడివారిపాలెం పరీక్ష కేంద్రాలను కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించారు.

రావులపాలెం: మండలంలోని ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రావులపాలెం జడ్పీ బాలురు, బాలికలు, గోపాలపురం, వెదిరేశ్వరం, ఊబలంక ఉన్నత పాఠశాలల్లో జరిగే పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు హాజరయ్యారు.

శిథిల వంతెనతో భయం.. భయం

● 2018లో టీడీపీ ప్రభుత్వంలో పునర్నిర్మాణానికి అనుమతులు
● ఆపై నిర్లక్ష్యం చేసిన వైసీపీ ప్రభుత్వం
● 'కూటమి'లో నిర్మాణం పూర్తి చేయాలంటున్న కోట గ్రామస్థులు


కోటలో శిథిలావస్థకు చేరుకున్న వంతెన

కె.గంగవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట గ్రామంలో బ్యాంక్ కెనాల్‌పై నిర్మించిన పురాతన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. దీనితో ఆగ్రామ ప్రజలు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కోట గ్రామ ముఖద్వారంగా ఈ వంతెన ఉంది. చొప్పెల్ల-యానాం బ్యాంక్ కెనాల్‌పై కోట గ్రామం వద్ద పూర్వం బల్లకట్టు ఉండేది. ప్రజల సౌకర్యార్థం 1956 సంవత్సరంలో ఈ కాలువపై వంతెన నిర్మించారు. సుమారు 69 సంవత్సరాల క్రితం నిర్మించిన వంతెన కావడంతో స్లాబ్ పెచ్చులు ఊడిపోతున్నాయి. మరో పక్క వంతెన రైలింగ్ లపై నుంచి పిచ్చి మొక్కలు మొలుస్తున్నాయి. ప్రమాదం గా మారిన వంతెన గురించి 2018 సంవత్సరంలో నాటి తెలుగుదేశం ప్రభుత్వంలో వంతెన పునర్నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. ఈలోపు ప్రభుత్వం మారింది. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపో యాయి. గత వైసీపీ ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణంపై దృష్టి పెట్టలేదు. పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో నేడు ఈ వంతెన మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. కె.గంగవరం-కోటిపల్లి ఆర్ అండ్‌బీ రహదారి నుంచి కోట గ్రామానికి వెళ్లాలం టే ఈ బ్యాంక్ కెనాల్‌పై వంతెన దాటవలసిందే. ఈ వంతెన శిథిలావస్థకు చేరుకో వడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కూటమి అధికారం లోకి వచ్చింది. గతంలోనూ టీడీపీ ప్రభుత్వమే వంతెన నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం శిథిలా వస్థలో ఉన్న వంతెనను పునఃనిర్మించాలని కోట గ్రామ ప్రజలు కోరుతున్నారు.


కోటలో వంతెన పెచ్చులు ఊడిపోతున్న దృశ్యం

చెట్టును ఢీకొని యువకుడి మృతి

ద్రాక్షారామ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం తాళ్లపొలం వద్ద బీరు ఫ్యాక్టరీ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన శ్రీదత్తు(28) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రపురం నుంచి తాళ్లపొలం వైపు వెళ్తూ బీరు ఫ్యాక్టరీ దాటిన తరువాత చెట్టును ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన శ్రీదత్తును రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న గోవింద మాలధారులు

రావులపాలెం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని శ్రీ అలివేలు మంగ పద్మావతి ఆండాళ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. స్వామివారికి ఖండవల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు ఆధ్వర్యంలో వాడపల్లి కమలనాథ్ అర్చకత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు గోవిందమాలధారులు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ ఛైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి పర్యవేక్షించారు.

మాలమహానాడు నిరసన

అమలాపురం టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు క్యాబినేట్ ఆమోదం తెలపడాన్ని నిరసిస్తూ మాలమహానాడు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు క్యాంపు కార్యాలయాన్ని నాయకులు ముట్టడించి ధర్నా చేపట్టారు.

రైలు ఢీకొని టీడీపీ నాయకుడి మృతి


సురేష్(ఫైల్)

సామర్లకోట/ద్రాక్షారామ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని నెలపర్తిపాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, వెలంపాలెం నీటి సంఘం అధ్యక్షుడు సురేష్ మృతి చెందాడు. కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని పెదబ్రహ్మదేవం జోడునాదాలు సమీపంలో సోమవారం ఉదయం రైల్వే ట్రాక్ దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని రైలు వేగంగా ఢీకొన్న ఘటనలో సదరు వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మృతుడిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వల్లూరి సురేష్‌బాబు(49)గా కుటుంబ సభ్యుల సమక్షంలో గుర్తించారు. ఒక ఫైనాన్స్ సంస్థలో కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేస్తున్న ఇతడు విధి నిర్వహణలో భాగంగా పెదబ్రహ్మదేవం సమీపంలోని ఇళ్లపల్లిపాకలు గ్రామానికి మోటారుసైకిలుపై బయల్దేరాడు. మార్గమధ్యంలో లఘుశంఖ తీర్చుకునేందుకు ట్రాక్ దాటుతుండగా అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చి రైలు ఢీకొనడమే కాక సుమారు 200 మీటర్ల దూరం లాక్కెళ్లింది. దీంతో వ్యక్తి శరీరం గుర్తించలేని రీతిలో నుజ్జునుజ్జు అయిందని రైల్వే పోలీసులు చెప్పారు.

సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా మృతదేహం పడి ఉన్న ప్రదేశాన్ని కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పెద్దాపురం తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. సామర్లకోట రైల్వే ఎస్ఐ పి.వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. టీడీపీలో క్రియాశీల నాయకుడిగా పనిచేస్తూ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. ఇటీవల జరిగిన నీటి సంఘం ఎన్నికల్లో వెలంపాలెం నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సురేష్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. సురేష్ మృతి వార్త తెలుసుకున్న మంత్రి సుభాష్ దిగ్భ్రాంతికి లోనయ్యారు. శాసనసభలో ఉన్న ఆయన సురేష్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.